MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 317 | పేజీలు : 8 | శుక్రవారం 6 నవంబర్ 2026 | వెల : 6-00



అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది

- గోకుల్ డెయిరీ వివాదంపై రాహుల్ విమర్శలు
- ఎన్నికల తర్వాత నిబంధనలు మార్చిందని ఆరోపణ
- 25 స్థానాల్లో కాంగ్రెస్ ప్యానెల్‌కు 13 సీట్లు
- బోర్డులో నామినేటెడ్ సభ్యుల నియామకంపై వివాదం
- సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్న పవన్ ఖేడా

5



ధైర్యముంటే ప్రధానికి లేఖ రాయండి

- రాహుల్‌కు అమిత్ షా సవాల్..
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి సిద్ధమని ప్రకటన
- ఎస్ఐఆర్, ఈవీఎంలపై చర్చకు సిద్ధమని వెల్లడి
- చొరబాటుదారుల ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్‌కు ప్రశ్న
- పార్లమెంట్‌ను అడ్డుకుంటున్నారంటూ విమర్శలు
- ఓటర్ల జాబితా సవరణను సమర్థించిన సీఎం సైనీ

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- ఎన్నికల బరిలో నిలిచిన 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం
- 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు
- 77 జడ్పీటీసీ, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం
- నేడు రీపోలింగ్.. 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- 40 వేల మందికి పైగా పోలీసులతో భద్రత

అమరావతి, మహానగర్

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలక ఘట్టమైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం కారణంగా ఉదయం పోలింగ్ మందకొడిగా సాగినా, మధ్యాహ్నం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. చెదురుమదురు ఘర్షణలు, వాగ్వాదాలు మినహా చాలా ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటలకు క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో ఎన్నికల బరిలో నిలిచిన 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 659 జడ్పీటీసీ స్థానాల్లో 77 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అలాగే 9,821 ఎంపీటీసీ స్థానాల్లో 2,051 స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మిగిలిన స్థానాలకు ఎన్నికలు జరిగాయి. జడ్పీటీసీ స్థానాలకు 2,169 మంది, ఎంపీటీసీ స్థానాలకు 18,843 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. రాష్ట్రంలో మొత్తం - మిగతా 2లో



ఓటర్లకు సహకరించాలి

- ఓటింగ్ శాతం పెంచేందుకు కూటమి శ్రేణులకు దిశానిర్దేశం
- ప్రతి ఓటరూ హక్కు వినియోగించుకునేలా చూడాలి
- వృద్ధులు, దివ్యాంగులకు సహకరించాలి
- పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలి
- ఘర్షణలకు తావులేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి
- పరిషత్ ఎన్నికల పోలింగ్‌పై చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్.. ఓటింగ్ శాతం పెంచాలని పిలుపు

2లో

పారా క్రీడల్లో భారత్ పతకాల ప్రభంజనం!

- 14 నుంచి 114కు.. పారా అథ్లెట్ల సత్తా!
- మీరు దేశాన్ని గర్వపడేలా చేశారు
- ఆసియా పారా గేమ్స్‌లో భారత క్రీడాకారుల ఘనత
- 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్య పతకాలు
- ఐదు ప్రపంచ రికార్డులు.. తొమ్మిది ఆసియా రికార్డులు
- మహిళా అథ్లెట్ల ప్రదర్శనపై ప్రధాని ప్రశంసలు

5



ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ

- యువ ఓటర్ల నమోదుకు ఈసీ కీలక నిర్ణయం
- నవంబర్ 30న ముసాయిదా జాబితా ప్రచురణ
- 2027 జనవరి 21న తుది ఓటర్ల జాబితా
- ఆధార్ సమర్పణ స్వచ్ఛందమేనని స్పష్టీకరణ
- ఓట్ల తొలగింపుపై క్షేత్రస్థాయి విచారణ తప్పనిసరి

5




మురసు తుఫాను నష్టం రూ.1,918 కోట్లు

1.43 లక్షల హెక్టార్లలో దెబ్బతిన్న పంట పొలాలు

రాష్ట్రంలో తుఫాను నష్టంపై సమీక్షించిన ముఖ్యమంత్రి

ముంపు ప్రభావిత ప్రాంతాల్లో నేడు సీఎం పర్యటన



అమరావతి, మహానగర్

మురసు తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రూ. 1,918 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. ఈమేరకు క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు మురసు తుఫాను నష్టాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, విద్యుత్, మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖల వారీగా జరిగిన నష్టాన్ని, చేపట్టిన సహాయక చర్యల వివరాలు సీఎం తెలుసుకున్నారు. వరుసగా రెండు తుపాన్లు రాష్ట్రాన్ని ప్రభావితం చేసిన నేపథ్యంలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, రహదారుల మరమ్మతులు, తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవడంపై ప్రధానంగా దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. శుక్రవారం స్వయంగా తాను తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని తెలిపారు. మురసు తుఫాన్ నష్టంపై సమగ్ర నివేదిక త్వరితగతిన రూపొందించి కేంద్రానికి సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు తాజాగా వెల్లడించిన ప్రాథమిక నష్టం అంచనాల ప్రకారం... తుపాను కారణంగా రాష్ట్రానికి సుమారు రూ.1,918.55 కోట్ల మేర ప్రాథమిక నష్టం వాటిల్లింది. 1,43,122 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతినగా, 1,86,063 మంది రైతులపై ప్రభావం పడింది. ఉద్యానవన పంటలు 6,749 హెక్టార్లలో - మిగతా 2లో

కార్యకర్తల పోరాటానికి సెల్యూట్

చంద్రబాబు గెలిచి ఓడారు.. మేం ఓడి గెలిచాం!

- స్థానిక ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ వైఎస్ జగన్ ఆరోపణలు
- పోలింగ్ శాతాల పెరుగుదలపై అనుమానాలు.. బ్యాలెట్ బాక్సులపైనా ప్రశ్నలు
- తుపాన్ల నష్టంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శ



అమరావతి, మహానగర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి అక్రమాలకు పాల్పడిందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. పోలింగ్ శాతాలను రాత్రికి రాత్రే పెంచి చూపించి గెలుపును తమ ఖాతాలో వేసుకున్నారని విమర్శించారు. చంద్రబాబు గెలిచినా నైతికంగా ఓడిపోయారని, తాము ఓడినా ప్రజల తరఫున పోరాడి గెలిచామని వ్యాఖ్యానించారు. ఎన్నికలు సజావుగా జరిగి ఉంటే టీడీపీ గెలిచేదా? అని ప్రశ్నించారు. విశాఖపట్నంలో రాత్రికి రాత్రే 1,15,887 ఓట్లు ఎలా పెరిగాయని జగన్ ప్రశ్నించారు. సోమవారం ఉదయానికి పోలైన ఓట్ల సంఖ్య 1,35,154కు ఎలా చేరిందని నిలదీశారు. రాత్రి 51.46 శాతంగా ఉన్న పోలింగ్ మరుసటి ఉదయానికి 56.03 శాతానికి ఎలా పెరిగిందని ప్రశ్నించారు. చీమకుర్తిలో రాత్రి 11 గంటలకు 78.28 శాతంగా ఉన్న పోలింగ్ అర్ధరాత్రి 12 గంటలకు 84.36 శాతానికి ఎలా చేరిందని అన్నారు. జమ్మలమడుగులో ఉదయం 11 గంటలకే 60 శాతం పోలింగ్ ఎలా నమోదైందని, అద్దంకిలో ఉదయం 11 గంటలకు 19 శాతంగా ఉన్న పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంటకు 56 శాతానికి ఎలా పెరిగిందని ప్రశ్నించారు. ధర్మవరంలో రెండు గంటల్లో 8 శాతం నుంచి 36.36 - మిగతా 2లో

కొరియాలో ఒడిశా పోలీసుల ఆగడాలు సహించం!

- గిరిజనుల ఓటు హక్కును అడ్డుకోవద్దు..
- మంత్రి సంధ్యారాణి హెచ్చరిక
- 29 గ్రామాల్లో బెదిరింపులు, దాడులు, కిడ్నాప్‌లకు పాల్పడుతున్నారని ఆరోపణ
- సరిహద్దును భారత్-పాక్ సరిహద్దులా మార్చొద్దని హితవు

2



ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

-మొదటిపేజీ తరువాయి

2,61,52,377 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1.28 కోట్ల మంది పురుషులు, 1.32 కోట్ల మంది మహిళలు, 1,282 మంది ఇతరులు ఉన్నారు.

మూడు గంటల వరకు 58.55 శాతం

మధ్యాహ్నం 3 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 58.55 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. పోలింగ్ ముగిసే సమయానికి ఈ శాతం 65 నుంచి 68 శాతం మధ్య ఉండవచ్చని ప్రాథమిక అంచనాలు వెలువడ్డాయి. రాయలసీమ, కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో ఓటర్లు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని గిరిజన, తీర ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైనట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 31,460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, 8,904 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా, 7,160 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించారు.

పలు చోట్ల ఉద్రిక్తతలు

పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరిగినట్లు సమాచారం. మరికొన్ని చోట్ల కర్రలు, రాళ్లతో దాడులు జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఘటనలతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును పటిష్ఠం చేశారు. పోలింగ్ ప్రక్రియకు పెద్దగా అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు.



40 వేల మందికి పైగా పోలీసులతో భద్రత

ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా భారీగా సిబ్బందిని నియమించారు. సుమారు 2.52 లక్షల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. 40,679 మంది పోలీసులను భద్రతా విధులకు వినియోగించారు. సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాల్లో సీసీటీవీ నిఘా, వెబ్‌కాస్టింగ్, వీడియో చిత్రీకరణ ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేసి, పోలీసు భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు.

రీపోలింగ్.. 7న కౌంటింగ్

ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఏవైనా కేంద్రాల్లో రీపోలింగ్ అవసరమైతే నవంబర్ 6న నిర్వహించనున్నారు. అనంతరం నవంబర్ 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 365 కేంద్రాల్లో 9,062 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. లెక్కింపు ప్రక్రియ కోసం సుమారు 52 వేల మంది సిబ్బందిని వినియోగించనున్నారు. కౌంటింగ్ పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ ఫలితాల అనంతరం ఎంపీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ల ఎన్నికల ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు. దీంతో గ్రామీణ స్థానిక సంస్థల్లో కొత్త పాలకవర్గాల ఏర్పాటు దిశగా తదుపరి ఘట్టం ప్రారంభం కానుంది.

ముసురు తుఫాను నష్టం రూ.1,918 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

దెబ్బతినగా, 12,586 మంది రైతులు ప్రభావితమయ్యారు. వర్షాల కారణంగా 983 ఇళ్లు, 346 బోట్లు, 220 వలలు కూడా దెబ్బతిన్నాయి. నీట మునిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు 48--72 గంటల సమయం అవసరమని అధికారులు తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ యుద్ధ ప్రాతిపదికన జరుగుతోందని అధికారులు వివరించారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో 1,103 ప్రభావిత 11 కేవీ ఫీడర్లలో 871 పునరుద్ధరించినట్టు సీఎంకు తెలిపారు. మరో 232 పునరుద్ధరించాల్సి ఉందని స్పష్టం చేశారు. 3,946 దెబ్బతిన్న 11 కేవీ విద్యుత్ స్తంభాల్లో 1,493 పునరుద్ధరించారు. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో 11 కేవీ ఫీడర్లన్నీ పునరుద్ధరించాల్సి ఉందన్నారు. ఏపీ ట్రాన్స్‌కో పరిధిలో ప్రభావితమైన 25 హైటెన్షన్ ఫీడర్లలో 21 పునరుద్ధరించారు. ఆర్ అండ్ బీ పరిధిలో రాష్ట్ర, జిల్లా రహదారులు 760.10 కిలోమీటర్ల వరకు దెబ్బతిన్నాయి. 206 ప్రాంతాల్లో నేలకొరిగిన చెట్లను తొలగించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ పరిధిలో 74 గ్రామీణ రహదారులు దెబ్బతినగా, 204.14 కిలోమీటర్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. వీటి పునరుద్ధరణకు రూ.92.08 కోట్ల అవసరమని అంచనా వేశారు. గురువారం వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 31,428 టవర్లలో 30,518 టవర్లు తిరిగి పనిచేస్తున్నాయి. 97.1 శాతం సేవలు పునరుద్ధరించారు. బాపట్ల, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లోనే పలుచోట్ల టవర్ల పునరుద్ధరణ జరగాల్సి ఉంది. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 59 మండలాలు, 649 గ్రామ పంచాయతీలు ప్రభావితం అయ్యాయి. 336 చోట్ల గుర్తించిన డ్రైనేజీ అడ్డంకులన్నింటినీ తొలగించారు. పారిశుద్ధ్య పనుల కోసం 5,515 బృందాలు, 1,489 జనరేటర్లను వినియోగిస్తున్నారు. పది వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎనిమిదింటికి రాకపోకలను పునరుద్ధరించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో మరో రెండు ప్రాంతాలకు రాకపోకలు పునరుద్ధరించాల్సి ఉంది. ప్రకాశం బ్యారేజీకి 43,500 క్యూసెక్కుల వరద ప్రవాహాలు కొనసాగుతున్నాయి. యథాతథంగా ఈ నీటిని దిగువకు వదిలిపెడుతున్నారు. 70 గేట్లలో 60 గేట్లు తెరిచి ఉంచారు. బుడమేరు డైవర్షన్ ఛానల్ ద్వారా 6,047 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. తమ్మిలేరు ఇన్‌ఫ్లో 26,000 క్యూసెక్కుల నుంచి 10,200 క్యూసెక్కులకు తగ్గింది. నల్లమడ డ్రెయిన్‌లో 30,259 క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. ప్రధాన జలాశయాలు, కాలువల పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. తుపాను కారణంగా బాపట్ల జిల్లాలో ఐదు, గుంటూరు జిల్లాలో రెండు, పల్నాడు జిల్లాలో ఒకటి చొప్పున మొత్తం ఎనిమిది మంది మృతి చెందినట్లు గుర్తించారు. తుపాను సహాయక చర్యల్లో 11 ఎస్‌డీఆర్ఎఫ్, 13 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో పాటు 390 మంది అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 5.87 కోట్ల ముందస్తు హెచ్చరిక సందేశాలు ప్రజలకు పంపించారు. బాధితులకు 52,768 ఆహార పొట్లాలు, 43,954 తాగునీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. 211 వైద్య శిబిరాలు నిర్వహించారు. తక్షణ సహాయక చర్యల కోసం ప్రభుత్వం జిల్లాలకు రూ.37 కోట్లు విడుదల చేసింది. దెబ్బతిన్న విద్యుత్, రహదారులు, తాగునీటి వ్యవస్థల పునరుద్ధరణతో పాటు ఇతర మౌలిక వసతుల మరమ్మతులు శరవేగంగా కొనసాగుతున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

ఓటర్లకు సహకరించాలి

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం ఎన్డీఏ కూటమి నేతలు, బూత్ స్థాయి కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ శాతం తగ్గకుండా చూడాలని, ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సహకరించాలని సూచించారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ, ఓటర్ల భాగస్వామ్యం, శాంతిభద్రతల పరిస్థితులపై కూటమి శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా నేతలు, కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

ఘర్షణలకు తావివ్వొద్దు

పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించినట్లు సమాచారం. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొనేలా చైతన్యపరచాలని కూటమి నేతలకు పిలుపునిచ్చారు.

కార్యకర్తల పోరాటానికి సెల్యూట్

-మొదటిపేజీ తరువాయి

శాతానికి, పార్వతీపురంలో 12 శాతం నుంచి 44 శాతానికి పోలింగ్ ఎలా పెరిగిందని నిలదీశారు.

నామినేషన్ల నుంచి ఫలితాల వరకు అక్రమాలే

ఎన్నికల ప్రక్రియలో అడుగడుగునా అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. నామినేషన్లు, స్క్రూటినీ, పోలింగ్ బూత్‌లు, పోలింగ్ శాతాలు, బ్యాలెట్ బాక్సులు, చివరకు ఫలితాల ప్రకటనలోనూ అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించిన బ్యాలెట్ బాక్సులకు సైతం సీళ్లు వేయలేదని ఆరోపించారు. తమ అభ్యర్థులు గెలిచిన చోట్ల కూడా ఫలితాలను తారుమారు చేశారని ధ్వజమెత్తారు. యువతరానికి సైతం రిగ్గింగ్, పోలింగ్ అక్రమాలపై శిక్షణ ఇస్తున్నట్లుగా చంద్రబాబు ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

'ఏపీ ఫర్ సేల్‌గా మారింది'

చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ అమ్మకానికి పెట్టినట్లుగా మారిందని జగన్ విమర్శించారు. ప్రభుత్వ భూములను 99 పైసలకే కట్టబెట్టారని ఆరోపించారు.



రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం, గంజాయి సమస్యలు కనిపిస్తున్నాయని అన్నారు. రాజధాని సహా పలు రంగాల్లో అవినీతి, కుంభకోణాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. ఏపీని 'సౌత్ బిహార్'తో పోలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల తరపున తమ పార్టీ బలంగా గొంతు వినిపించిందని జగన్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలను దేశం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా పోరాడారని ప్రశంసించారు. వారి పోరాటానికి సెల్యూట్ చేస్తున్నట్లు తెలిపారు.

తుపాన్ల నష్టంపై ప్రభుత్వాన్ని నిలదీత

మురసు తుపాను ప్రభావం ఉన్నప్పటికీ ఎన్నికలను వాయిదా వేయలేదని జగన్ విమర్శించారు. తుపాను సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వానికి ప్రధాన ప్రాధాన్యంగా ఉండాలని అన్నారు. అర్నబ్ తుపాను కారణంగా పది మందికి పైగా మరణించారని, 150 గ్రామాలకు ఇప్పటికీ విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదని ఆరోపించారు. మురసు తుపాను కారణంగా ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తగిన సాయం అందించలేదని విమర్శించారు. 13 నెలల క్రితం వచ్చిన మోంథా తుపాను నష్టపరిహారానికి సంబంధించి జీవోలు జారీ చేసినప్పటికీ, బాధితులకు నగదు అందలేదని జగన్ ఆరోపించారు.

దామోదర-లక్ష్మీకాంత రావులపై మహేష్ గౌడ్ సీరియస్ !

హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో రోజురోజుకూ శృతిమించుతున్న గ్రూపు తగాదాలు, బాహాటంగా రచ్చకెక్కుతున్న క్రమశిక్షణా రాహిత్యంపై టీపీసీసీ నాయకత్వం గట్టిగా దృష్టి సారించింది. పార్టీ నేతల వివాదలా? పార్టీ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీస్తోందని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయా? పార్టీ సంస్థాగత నియామకాల విషయంలో నేతల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు చివరకు బహిరంగ ఘర్షణకు దారితీసిందా? ఢిల్లీలోని ఓ ప్రముఖ హోటల్ వేదికగా చోటుచేసుకున్నట్లు ప్రచారంలోకి వచ్చిన ఘటన ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు రైతుల సమస్యలు, మరోవైపు పార్టీ వ్యవహారాలు.. వీటన్నింటినీ పక్కనపెట్టి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఢిల్లీలోనే పరస్పరం తలపడినట్లు వస్తున్న వార్తలు పార్టీ ప్రతిష్ఠకు సవాలుగా మారాయి.పార్టీ అధికారంలో ఉన్న వేళ నేతలు సంయమనం పాటించాల్సింది పోయి.. వ్యక్తిగత ఆధిపత్యం, నామినేటెడ్ పదవులు, నియోజకవర్గ వ్యవహారాలపై పరస్పరం దాడులకు దిగడంపై ఆయన సీరియస్ అయ్యారు. అంతర్గత క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై ఎంతటి స్థాయి నేతలైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావుల వివాదాన్ని టీపీసీసీ చీఫ్ తీవ్రమైన అంశంగా పరిగణించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా హోటల్ లాబీలో డీసీసీ అధ్యక్ష పదవి, సంస్థాగత నియామకాల విషయంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి, సహచర ఎమ్మెల్యేల ముందే బాహాబాహీకి దిగే స్థాయికి వెళ్లడం పార్టీ వర్గాల్లో పెను దుమారం రేపింది. తోటి ఎమ్మెల్యేల సమక్షంలో మంత్రి దామోదర తనపై తీవ్ర పదజాలంతో దూషణలకు దిగారని ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావు ఇప్పటికే పీసీసీకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటన పార్టీ హైకమాండ్ దృష్టికి కూడా వెళ్లింది. ఈ వివాదంపై పూర్తి విచారణ జరిపేందుకు బుధవారం నాడు గాంధీ భవన్‌కు స్వయంగా హాజరుకావాల్సిందిగా మంత్రి దామోదర, ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావులకు పీసీసీ చీఫ్ ఆదేశాలు జారీ చేశారు.మంత్రి, ఎమ్మెల్యే వివాద పరిష్కారం తర్వాత.. రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల్లో ఇటీవల చోటుచేసుకున్న వరుస క్రమశిక్షణా ఉల్లంఘనలపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని పీసీసీ నిర్ణయించింది. ఢిల్లీలోని శాంగ్రిలా హోటల్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు సమాచారం. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల నియామకాలకు సంబంధించి ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. తమ వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న పట్టుదల, పార్టీ పదవుల పంపకాలపై అసంతృప్తి ఈ వివాదానికి కారణమన్న ప్రచారం జరుగుతోంది.ఈ క్రమంలో హోటల్ లాబీలోనే ఇద్దరి మధ్య మాటామాటా పెరిగినట్లు సమాచారం. 'రూములో వేసి నీ గురించి ఏం అనుకుంటున్నావు?' అంటూ మంత్రి దామోదర రాజనర్సింహ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో ఇద్దరూ పరస్పరం దాడికి దిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఒకరినొకరు కొట్టుకునే స్థాయికి వివాదం వెళ్లిందన్న వార్త రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది.

ఇతర ఎమ్మెల్యేల ముందే అవమానం?

ఈ ఘటన సమయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఓ సీనియర్ జర్నలిస్ట్ అక్కడే ఉన్నట్లు సమాచారం. ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో మంత్రి తనను దూషించి అవమానించారని లక్ష్మీకాంతరావు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఆయన ఇప్పటికే పీసీసీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అంతటితో ఆగకుండా పార్టీ అధిష్ఠానానికి కూడా ఫిర్యాదు చేయాలని యోచిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది.ఈ వ్యవహారం నిజంగా ఎంతవరకు వెళ్లింది? ఇద్దరు నేతల మధ్య వివాదానికి అసలు కారణాలేమిటి? పార్టీ పెద్దలు ఈ అంశాన్ని ఎలా పరిష్కరిస్తారు? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయిఈ ఘటన రాజకీయంగా మరో కీలక చర్చకు తెరలేపింది. తెలంగాణలో రైతులు వివిధ సమస్యలతో సతమతమవుతున్న సమయంలో అధికార పార్టీ నేతలు మాత్రం పార్టీ పదవులు, వర్గ రాజకీయాల కోసం ఢిల్లీలోనే ఘర్షణలకు దిగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు తమలో తాము ఆధిపత్య పోరుకు దిగడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి.ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి, ప్రజల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే మధ్యే సఖ్యత లేకపోతే పార్టీ కేడర్‌కు ఎలాంటి సందేశం వెళ్తుందన్నది మరో ప్రశ్న. జిల్లా స్థాయి పార్టీ పదవుల విషయంలోనే నేతలు సంయమనం కోల్పోతే, ప్రభుత్వ పాలనలో సమన్వయం ఎలా ఉంటుందన్న విమర్శలకు ఈ పరిణామం అవకాశం కల్పిస్తోంది.

అధిష్ఠానం జోక్యం తప్పనిసరేనా?

కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు కొత్తేమీ కాకపోయినా, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అంతర్గత విభేదాలు ఇలాంటి స్థాయికి చేరుతున్నాయన్న ప్రచారం పార్టీకి ఇబ్బంది కరంగా మారింది. ఈ వివాదం పీసీసీ పరిధిలోనే ముగుస్తుందా? లేక ఢిల్లీ పెద్దల వరకు చేరుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.డీసీసీ అధ్యక్షుల నియామకాల కోసం మొదలైనట్లు చెబుతున్న వివాదం ఇప్పుడు మంత్రి, ఎమ్మెల్యే మధ్య వ్యక్తిగత ఘర్షణగా మారిందన్న వార్త కాంగ్రెస్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. రైతుల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన సమయంలో నేతల మధ్య ఈ తరహా పరిణామాలు చోటుచేసుకోవడం పార్టీకి రాజకీయంగా ఎంతమేర నష్టం కలిగిస్తుందో వేచి చూడాలి.హోటల్‌లో జరిగినట్లు ప్రచారంలో ఉన్న ఘర్షణకు సంబంధించి ఇరువురు నేతల అధికారిక స్పందన, స్వతంత్ర ధ్రువీకరణ అందుబాటులోకి వచ్చిన తర్వాత పూర్తి వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.ప్రధానంగా నియోజకవర్గ నిధుల పంపిణీ, స్థానిక సంస్థల సమన్వయం, అధికార వర్గాల బదిలీల విషయంలో మంత్రులపై బహిరంగంగా గళమెత్తుతున్న అసంతృప్త ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల వ్యవహార శైలిపై పార్టీ అధిష్టానం నివేదికలు సిద్ధం చేస్తోంది. మునుగోడు, జడ్చర్ల వంటి స్థానాల్లో సొంత పార్టీ ప్రజాప్రతినిధులే ప్రభుత్వంపై విరుచుకుపడుతుండటం, జిల్లాల్లో డీసీసీ అధ్యక్షుల నియామకాల వేళ వర్గపోరు భగ్గుమంటున్న పరిస్థితులన్నింటినీ సమీక్షించి ఆయా నేతలకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు హెచ్చరికలు జారీ చేయనున్నారు.

కొరియాలో ఒడిశా పోలీసుల ఆగడాలు సహించం!



కొరియా

ఆంధ్రప్రదేశ్–ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొరియా గ్రామాల్లో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. ఎన్నికల సమయంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళుతున్న గిరిజనులను ఒడిశా పోలీసులు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కొరియా గ్రామాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఒడిశా అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

గిరిజనులను బెదిరించడం దారుణం

కొరియాలోని 29 గ్రామాల్లో ఒడిశా అధికారులు, పోలీసుల ఆగడాలు మితిమీరిపోయాయని మంత్రి సంధ్యారాణి ఆరోపించారు. గిరిజనులను బెదిరించడం, దాడులకు పాల్పడటం, చివరకు కిడ్నాప్‌లకు కూడా దిగడం దారుణమని విమర్శించారు. ఎన్నికల నిర్వహణపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలి తప్ప, అమాయక గిరిజనులను ఇబ్బందులకు గురిచేయడం ఏమిటని ప్రశ్నించారు.

ఓటు హక్కును అడ్డుకునే అధికారం లేదు

గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అడ్డుకునే అధికారం ఎవరికీ లేదని మంత్రి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్–ఒడిశా సరిహద్దును భారత్–పాకిస్థాన్ సరిహద్దులా మార్చవద్దని హెచ్చరించారు. సరిహద్దు గ్రామాల ప్రజల మధ్య అనవసర ఉద్రిక్తతలు సృష్టించకుండా అధికారులు సంయమనం పాటించాలని సూచించారు.

కొరియాపై సీఎం ప్రత్యేక దృష్టి

కొరియా గ్రామాల సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారని సంధ్యారాణి తెలిపారు. మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి వంగలపూడి అనిత కూడా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారని వెల్లడించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్







- విజయవాడ, నందిగామ, తిరువూరు డివిజన్లలో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన
- విజయవంతంగా ముగిసిన ఓటింగ్ ప్రక్రియ :జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ
- పకడ్బందీ భద్రత, వెబ్‌కాస్టింగ్ నిఘా నడుమ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ముగింపు

విజయవాడ, మహానగర్

జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించిన జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ వెల్లడించారు. ఉదయం 7.00 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5.00 గంటల వరకు నిరంతరాయంగా, పారదర్శకంగా కొనసాగిందని తెలిపారు. సాయంత్రం 5.00 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ నిబంధనల ప్రకారం టోకెన్లు జారీ చేసి ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ ఉదయం నుంచే విజయవాడ, నందిగామ, తిరువూరు డివిజన్లలో విస్తృతంగా సుడిగాలి పర్యటన చేపట్టారు. విజయవాడ రూరల్ మండలం బోడపాడు, జి.కొండూరు మండలం వెలగలేరు, మైలవరం మండలం పుల్లూరు, కంచికచర్ల మండలం పరిటాల, ఏ.కొండూరు మండలం రామచంద్రాపురం తదితర పోలింగ్ కేంద్రాలను ఆయన స్వయంగా సందర్శించి ఓటింగ్ సరళిని, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొత్తం 992 పోలింగ్ కేంద్రాల్లో 5,200 మందికి పైగా ఎన్నికల సిబ్బంది, పోలీసు బందోబస్తు సమన్వయంతో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. సమస్యాత్మక కేంద్రాలతో పాటు మొత్తం 496 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, సీసీటీవీల ద్వారా జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం నిఘా ఉంచామని, దీనివల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ల నుంచి విశేష స్పందన లభించిందని, పట్టణాలు, ఇతర దూర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు సైతం తమ స్వగ్రామాలకు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిచెప్పిందన్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్సులను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీగా సీల్ చేసి, కట్టుదిట్టమైన భద్రత నడుమ నిర్దిష్ట స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే ప్రక్రియను పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల నిర్వహణలో అంకితభావంతో విధులు నిర్వర్తించిన ఎన్నికల సిబ్బందికి, పోలీసు అధికారులకు, మీడియా ప్రతినిధులకు, శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించిన ఓటర్లందరికీ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, దివ్యాంగులకు వీల్ చైర్ సౌకర్యం



చల్లపల్లి, మహానగర్

గ్రామంలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, దివ్యాంగులకు వీల్ చైర్ సౌకర్యం కల్పించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.వి మాధవేంద్రరావు పర్యవేక్షణలో జడ్పీ హైస్కూల్, ఎస్.ఆర్.వై.ఎస్.పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రాలలో దివ్యాంగుల కోసం వీల్ చైర్లు ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది వృద్ధులు, దివ్యాంగులకు వీల్ చైర్ సౌకర్యం వినియోగించుకుని ఓటు హక్కు వినియోగించుకునేందుకు సహకారం అందించారు.

గొర్తి శ్రీనివాస్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలి

కుటుంబానికి రక్షణతో పాటు రూ.5 కోట్ల ఆర్థిక సాయం అందించాలి

ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ పౌరోహిత బ్రాహ్మణ సమాఖ్య లేఖ



విజయవాడ, మహానగర్

బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ విజయవాడ బ్రాంచ్ మేనేజర్ గొర్తి శ్రీనివాస్ ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పౌరోహిత బ్రాహ్మణ సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సమాఖ్య అడహక్ కమిటీ చైర్మన్ మేడవరపు లక్ష్మణరావు, గౌరవాధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, హోంమంత్రి వంగలపూడి అనితకు ఈమెయిల్ ద్వారా లేఖ పంపినట్లు తెలిపారు. గొర్తి శ్రీనివాస్ ఆత్మహత్య బ్రాహ్మణ సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. ఆయన మరణ వాంగ్మూలంలో ప్రస్తావించిన అంశాలపై వారం రోజులైనా ప్రభుత్వం, కార్పొరేషన్ చైర్మన్ స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. మరణ వాంగ్మూలంలో క్రెడిట్ సొసైటీ సీఈవో గుళ్లపల్లి నాగసాయి, హెడ్ ఆఫీస్ ఉద్యోగిని బాలాత్రిపుర సుందరి, కార్పొరేషన్ ఎండీ శీలం చంద్రశేఖర్ ఆజాద్, చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ పేర్లు ఉన్నట్లు తమకు తెలిసిందని వెల్లడించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఈవోను కేవలం బదిలీ చేయడం కాకుండా సస్పెండ్ చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మిగిలిన వ్యక్తులను కూడా విచారణ పూర్తయ్యే వరకు విధులకు దూరంగా ఉంచాలని, రికార్డుల తారుమారుకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. క్రెడిట్ సొసైటీలో అవకతవకలపై ఏడాది కాలంగా పలు బ్రాహ్మణ సంఘాలు ఫిర్యాదులు చేస్తున్నా కార్పొరేషన్ చైర్మన్ నిర్లక్ష్యం వహించారని ఆరోపిస్తూ, బుచ్చి రాంప్రసాద్‌ను పదవి నుంచి తొలగించాలని లేదా రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. పదేళ్లుగా క్రెడిట్ సొసైటీ సభ్యులకు మహాజనసభ సమావేశం నిర్వహించని నాగసాయిని ఉద్యోగం నుంచి తొలగించి, ఆయనపై కేసులు నమోదు చేయాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాస్ కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించడంతో పాటు రూ.5 కోట్ల ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. 2024 కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో కార్పొరేషన్ క్రెడిట్ సొసైటీలను బలోపేతం చేస్తామని ఇచ్చిన హామీ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ డిమాండ్లపై అధికారిక ప్రకటన చేయకపోతే రాష్ట్రంలోని బ్రాహ్మణ సంఘాల సహకారంతో అమరావతిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించినట్లు సమాఖ్య ప్రతినిధులు తెలిపారు.

ఓటు హక్కు భారత ప్రజాస్వామ్యం ఇచ్చిన వరం - ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



అవనిగడ్డ, మహానగర్

ఓటు హక్కు భారత ప్రజాస్వామ్యం ఇచ్చిన వరం అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం అవనిగడ్డలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ – విజయలక్ష్మి దంపతులు, ఎమ్మెల్యే తనయుడు, కోడలు మండలి వెంకట్రామ్ – సాయి సుప్రియ దంపతులు కలసి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు నిలుస్తారన్నారు. ప్రజా సేవా దృక్పథం కలిగిన వారినీ అభివృద్ధి కాముకులను ఎన్నుకోవాల్సిన అవసరం ప్రజానీకంపై ఉందన్నారు. గ్రామాల అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ ఈ ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. ఓటు హక్కు ద్వారా తమకు నచ్చిన వ్యక్తులను ఎన్నుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఓటు వేసే మహోన్నత అవకాశాన్ని ఎవరూ జారవిడిచి పెట్టవద్దని కోరారు.

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు శక్తివంతమైన ఆయుధం

ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటుహక్కును వినియోగించుకోవాలి

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



ఆగిరిపల్లి, మహానగర్

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు అత్యంత పవిత్రమైన, శక్తివంతమైన ఆయుధమని, ప్రతి పౌరుడు బాధ్యతగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ఈదర, బొద్దనపల్లి పంచాయతీ పరిధిలోని శోభనాపురం, ఆగిరిపల్లి, తోటపల్లి గ్రామాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ సరళిని, ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు ఓటర్లను పోలింగ్ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, సమర్థవంతమైన స్థానిక సంస్థల నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి ఎన్నికలు కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. గ్రామీణ ప్రాంత ఓటర్లందరూ పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఎలాంటి భయాందోళనలకు తావులేకుండా స్వేచ్ఛగా, స్వతంత్రంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పండగలో ఎన్ఎస్ఎస్ సేవా స్ఫూర్తి

పోలింగ్ నిర్వహణలో పోలీసులకు అండగా వాలంటీర్లు

ఓటర్లకు అవసరమైన సహాయసహకారాలు అందించడంలో ప్రత్యేకత





విజయవాడ, మహానగర్

ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్లు తమ సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. విజయవాడ, మైలవరం, తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ మండలాలకు చెందిన 10 కళాశాలల నుంచి సుమారు 900 మంది విద్యార్థి వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని ఎన్నికల విధుల నిర్వహణలో తమ సేవలందించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంతో పాటు క్యూ లైన్ల నిర్వహణ, ఓటర్ల రాకపోకల క్రమబద్ధీకరణ, పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ పాటించేలా సహకరించారు. ఎన్నికల విధుల్లో పోలీసు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు సహా సహాయం అవసరమైన ఓటర్లకు అవసరమైన సహకారం అందిస్తూ పోలింగ్ ప్రక్రియలో వారికి ఇబ్బందులు కలగకుండా తోడ్పడ్డారు. యువతలో సామాజిక బాధ్యత, సేవా భావం పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తోందని, ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో వాలంటీర్లు స్వచ్ఛందంగా భాగస్వాములు కావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పోలీసు సిబ్బందితో కలిసి బాధ్యతాయుతంగా సేవలందించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు మార్గనిర్దేశనం చేయడంలో జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కొల్లేటి రమేష్ కీలకపాత్ర పోషించారు.

కార్తీక మాసంలో ప్రత్యేక పుణ్యక్షేత్ర యాత్రలు

ప్రతి సోమవారం పంచారామాల దర్శనం

ప్రతి శనివారం వాడపల్లి యాత్ర

విజయవాడ, మహానగర్

పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తుల కోసం ప్రత్యేక పుణ్యక్షేత్ర దర్శన ప్యాకేజీలను ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ (టూర్స్ అండ్ మార్కెటింగ్) టి.ఎస్. వీరనారాయణ వివరాలు వెల్లడించారు. కార్తీక మాసంలో ప్రతి సోమవారం పంచారామాల యాత్రతో పాటు ఏడాది పొడవునా ప్రతి శనివారం విజయవాడ–వాడపల్లి–విజయవాడ యాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. 12 సీట్ల మినీ ఏసీ బస్సు ద్వారా ఈ యాత్రలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పంచారామాల ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా అమరావతిలోని అమరలింగేశ్వర స్వామి ఆలయం, సామర్లకోటలోని కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయం, ద్రాక్షారామంలోని భీమేశ్వర స్వామి ఆలయం, పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం, భీమవరంలోని సోమేశ్వర స్వామి ఆలయాలను ఒకే రోజులో దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ యాత్ర నవంబర్ 16, 23, 30 తేదీలతో పాటు డిసెంబర్ 7న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 5 గంటలకు విజయవాడలోని లెమన్ ట్రీ హోటల్ పక్కన ఉన్న ఏపీటీడీసీ సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం నుంచి ప్రారంభమై రాత్రి 10 గంటలకు తిరిగి చేరుకుంటుందని వివరించారు. ఈ ప్యాకేజీకి పెద్దలకు రూ.2,370, పిల్లలకు రూ.1,920 చార్జీగా నిర్ణయించారు. అలాగే ప్రతి శనివారం విజయవాడ నుంచి వాడపల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేక యాత్ర నిర్వహించనుండగా, ఈ ప్యాకేజీకి పెద్దలకు రూ.1,350, పిల్లలకు రూ.1,100గా ధర నిర్ణయించారు. రెండు ప్యాకేజీల్లోనూ దర్శన టికెట్లు, భోజనం, ఇతర వ్యక్తిగత ఖర్చులను ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యమని, భక్తులు ఈ ప్రత్యేక ప్యాకేజీలను సద్వినియోగం చేసుకోవాలని వీరనారాయణ కోరారు.

ఈ నెల 7న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్

- ప్రక్రియ విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



మైలవరం, మహానగర్

జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఈ నెల 7వ తేదీన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో తదుపరి కీలక ఘట్టమైన ఓట్ల లెక్కింపు నిర్వహణకు సంబంధించి మైలవరం, రెడ్డిగూడెం మండలాలకు సంబంధించి మైలవరంలోని లక్కిరెడ్డి హనిమిరెడ్డి ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని కలెక్టర్ లక్ష్మీశ గురువారం తనిఖీ చేశారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సుల భద్రత, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులతో సమీక్షించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

ఐడీబీఐ వాటాలపై అనుమానాలు

బిజెపి ప్రభుత్వం మరో ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటుకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసింది. 1964లో పారిశ్రామిక అభివృద్ధి రుణాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పరచిన ప్రభుత్వ రంగ బ్యాంకు ఐడిబిఐ ని కెనడాకు చెందిన ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్స్‌కి కేంద్రం అప్పగిస్తోంది. అక్టోబర్ 14న కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ దీనికి ఆమోద ముద్రవేసింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఈ బ్యాంకుపై అధికారం చేతులు మారిపోతుంది. బ్యాంకుల విస్తరణ కారణంగా ఐడిబిఐ 2015లో పబ్లిక్ సెక్టర్ బ్యాంకుగా మారిపోయింది. ప్రస్తుతం అది మిగతా వాణిజ్య బ్యాంకుల మాదిరిగానే శాఖల ఏర్పాటుతోపాటు సేవలు అందిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న 2100 శాఖలు ఉన్న ఈ బ్యాంకులో 20వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 2015-16 లో ఈ బ్యాంకును మూల ధన కొరత, నిరర్థక ఆస్తుల పెరుగుదల లాంటి చిక్కులను ఎదుర్కొని రూ. 3వేల కోట్ల నష్టాలను మూట కట్టుకుంది. ఈ విపత్తు నుండి బ్యాంకును బయటపడేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసినీ వాడుకుంది. రూ. 22వేల కోట్లు వెచ్చించి ఎల్ఐసి ఈ బ్యాంకులో సుమారు సగం వాటాను సొంతం చేసుకుంది. అలా బలపడిన ఐడిబిఐ ఇప్పటికీ లాభాల బాటలోనే నడుస్తోంది. ఆనాటి వాటా అమ్మకంవల్ల ఈ బ్యాంకుపై హక్కులు 45.48% కేంద్ర ప్రభుత్వానికి, 49.24% ఎల్ఐసికి చెందుతాయి. ఇందులోంచి ఇప్పుడు కేంద్రం 30.48%, ఎల్ఐసి 30.24% వాటాను ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్‌కి అమ్మేస్తున్నాయి. వాటి మొత్తం విలువ రూ. 53 వేల కోట్లు. జులైలో జరిగిన వేలం పాటలో ఆ ఒక్క సంస్థే పాల్గొనడంతో ఈ ఒప్పందం కుదిరింది. ఇందువల్ల రూ. 81 ఉన్న బ్యాంకు షేర్ విలువను రూ. 76కు తగ్గించవలసి వచ్చింది. ఎల్ఐసికి మిగలబోయే 19% వాటాను కూడా త్వరలోనే బహిరంగ మార్కెట్ ద్వారా అమ్మేసేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఐడిబిఐలో ఈ వాటాను కొనుగోలు చేసి బ్యాంకుపై పెత్తనం పొందుతున్న ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్ సంస్థ యజమాని వివియన్ ప్రేమ్ వత్స. అతను ప్రవాస భారతీయుడు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఐఐటి మద్రాస్‌లో చదివాడు. కెనడా వెళ్లి ఒక దివాళా తీసిన బీమా కంపెనీని కొని ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్‌గా పేరు మార్చి లాభాలు గడిస్తూ ప్రముఖ వ్యాపారవేత్తగా ఎదిగారు. తన వ్యాపార విస్తరణలో భాగంగా ఇప్పుడు ఐడిబిఐని కొనుగోలు చేస్తున్నారు. బలమైన పునాదులున్నప్పటికీ సంక్షోభంలో ఉన్న కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడమే ప్రేమ్ వత్సా విజయానికి ప్రధాన సూత్రం.అలాంటి కంపెనీలను గుర్తించడంలో ఆయనకు అసాధారణమైన సామర్థ్యం ఉంది. అంతేకాదు, వాటిలో దీర్ఘకాలం పెట్టుబడులను కొనసాగించే సహనం కూడా ఉంది.కాలగమనాన్ని అంచనా వేయడంలోనూ వత్సా దిట్ట. సంక్షోభం రాబోతోందన్న సంకేతాలను ముందుగానే పసిగట్టగలరు.ఈ సామర్థ్యంతోనే 1987లో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల పతనాన్ని, బ్లాక్ మండేగా ప్రసిద్ధి చెందిన పరిణామాన్ని, 1990లో జపాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడాన్ని, 2008లో సబ్‌ప్రైమ్ సంక్షోభంగా పిలిచే అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభాన్ని ఆయన ముందుగానే గుర్తించారు.ఆ సమయంలో అమెరికా ఆర్థిక మందగమనాన్ని అవకాశంగా మలుచుకున్న ప్రేమ్ వత్సా, భవిష్యత్తులో మంచి పనితీరు కనబరిచే అవకాశమున్న కంపెనీల షేర్లను అతి తక్కువ ధరలకు కొనుగోలు చేశారు.అయితే, ఫెయిర్‌ఫాక్స్ కూడా ఎదురుదెబ్బలు చవిచూసింది. హార్వీ, ఇర్మా, మారియా తుపానులతో పాటు కాలిఫోర్నియాలో చెలరేగిన కార్చిచ్చుల వల్ల సంస్థకు గణనీయమైన నష్టాలు వచ్చాయి.కోవిడ్-19 మహమ్మారి కూడా సంస్థకు పెద్ద సవాలుగా మారింది. ఆ సమయంలో దాని బీమా వ్యాపారం భారీ నష్టాలను చవిచూసింది.అయితే, ప్రేమ్ వత్సా సామర్థ్యం ఫెయిర్‌ఫాక్స్‌ను మళ్లీ పుంజుకునేలా చేసింది.2022 అక్టోబర్‌తో పోలిస్తే 2025లో ఫెయిర్‌ఫాక్స్ విలువ నాలుగు రెట్లు పెరిగింది.ఫెయిర్‌ఫాక్స్ వ్యాపార వ్యూహం విజయవంతమైంది.బీమా క్లెయిమ్‌లు చెల్లించాల్సిన సమయం రాకముందే భారీ మొత్తంలో ప్రీమియంలను వసూలు చేసి, బలమైన పునాదులున్నప్పటికీ తక్కువ ధరకు లభించే షేర్లలో పెట్టుబడులు పెట్టడం ద్వారా సంస్థ విజయాన్ని సాధించింది.వ్యాపార, పారిశ్రామిక రంగాలకు చేసిన అసాధారణ సేవలకు గుర్తింపుగా ప్రేమ్ వత్సాకు పద్మశ్రీ పురస్కారం లభించింది.ఇప్పటికే ఆయన 2016 లో రూ. 1180 కోట్లతో కేరళంలోని సిఎస్‌బి బ్యాంకులో 51% వాటా సొంతం చేసుకున్నారు. 2020 లో భారత కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించడం విశేషం. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం ఒక విదేశీయుడు దేశంలోని రెండు బ్యాంకులను హస్తగతం చేసుకోరాదు. ఈ లెక్కన ఫెయిర్ ఫ్యాక్స్ సంస్థ ఒక బ్యాంకు నుంచి వైదొలగాలి లేదా రెండు బ్యాంకులను కలిపేసి ఒక్క బ్యాంకుగా మార్చాలి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటాలను బహిరంగంగా అమ్మేస్తూ, వాటిలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంచుతూ దేశ బ్యాంకింగ్ రంగాన్ని బలహీనపరుస్తోంది. బ్యాంకులను జాతీయం చేసిన లక్ష్యాలకు అవి దూరమవుతున్నాయి. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బ్యాంకు ఉద్యోగులు సమ్మెలు, ఆందోళనలు చేపట్టినా వాటి ప్రభావం ప్రభుత్వ చర్యలపై పెద్దగా ఉండడం లేదు. ఐడిబిఐని బాహాటంగా అమ్మేయడమే దీనికి తార్కాణం. దేశంలోని రెండు బ్యాంకులను ఒకే విదేశీ సంస్థ కొనుగోలు చేయడం వల్ల ఆ రెండు బ్యాంకుల ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఒక బ్యాంకులోంచి వాటా వెనక్కి తీసుకొనే బదులు రెండింటిని కలిపి వేయడానికే యాజమాన్యం మొగ్గు చూపుతుంది. ప్రైవేటు చేతుల్లోకి వెళ్లి తమ అస్తిత్వాన్ని కోల్పోవడానికి ఐడిబిఐ ఉద్యోగులు సిద్ధంగా లేరు. ఇప్పటికే ఫెయిర్ ఫాక్స్ సొంతమైన సిఎస్‌బి ప్రైవేటు బ్యాంకు, ఐడిబిఐ ప్రభుత్వ రంగ బ్యాంకు. ప్రభుత్వ రంగ సంస్థ ప్రైవేటు చేతుల్లోని వెళితే దాని ప్రభావం ఉద్యోగుల పని భారం, వేతనాలపై అధికంగా పడుతుంది. ఇక నుంచి ఐడిబిఐ ఉద్యోగుల వేతన సవరణ మిగతా జాతీయ బ్యాంకుల ఉద్యోగుల మాదిరిగా ఉండదు. జరగబోయే ఉద్యోగ నియామకాల్లో, ప్రమోషన్లలో రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లు ఉండవు. ఉద్యోగ భద్రత విషయంలో ఐడిబిఐ సిబ్బంది ఎంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ వారు ఇప్పటికే ఉద్యమం బాటపట్టారు. ఈ నెల 2, 3 తేదీల్లో బ్యాంకులు మూసేసి సమ్మెలో పాల్గొన్నారు. దీపావళి తర్వాత పూర్తి స్థాయి కార్యాచరణ ఉంటుందని వారి నేతలు అంటున్నారు. ప్రభుత్వం తగిన హామీలు ఇవ్వకుంటే తమ ప్రతిఘటనను తీవ్రతరం చేస్తామని, దేశంలోని అన్ని బ్యాంకు ఉద్యోగ సంఘాలను సంప్రదించి, వారి ఐక్యతతో దేశవ్యాప్త నిరసనలు చేపడతామని అంటున్నారు. సాంకేతికత పైచేయి వల్ల ఉద్యోగ శక్తి బలహీనపడి ప్రభుత్వాలకు ఎదురు లేకుండాపోయింది. బ్యాంకుల కంప్యూటరీకరణ ఉద్యోగుల ప్రమేయాన్ని తగ్గించింది. ఏ ప్రభుత్వ రంగ సంస్థనైనా కేంద్రంలో ఉన్న బిజెపి కూటమి తన ఇష్టారాజ్యంగా అంగట్లో పెడుతోంది. ఇది కేవలం ఐడిబిఐ సమస్యే అనుకోరాదు. పాలన ఇలాగే ఉంటే ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఎదురుకావచ్చు.

బలపడుతున్న మత సమీకరణాలు



ఇజ్రాయెల్ పార్లమెంటు నెస్సెట్‌కు అక్టోబరు 27న జరిగిన ఎన్నికల్లో ఏ కూటమికీ మెజారిటీ రాలేదు. మొత్తం 120 స్థానాలకు గాను, నెతన్యాహు కూటమి 53, ప్రతిపక్షం 48 స్థానాలు దక్కించుకోగా, 19 స్థానాలతో అరబ్ పార్టీలు కింగ్ మేకర్లుగా అవతరించాయి. మత, జాతీయ గుర్తింపుల కారణంగా వాటితో కలిసి పనిచేయడానికి ఇంతకాలం వెనుకంజ వేస్తూ వచ్చిన ఇజ్రాయెల్‌లోని ప్రధాన రాజకీయ కూటములకు, ఇప్పుడు ప్రభుత్వ ఏర్పాటులో వాటి మద్దతును కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. లేకపోతే దేశం మరోసారి సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కోవాల్సి రావచ్చు. అక్టోబరు 26న ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో.. ఇటీవల కుదిరిన మక్కా త్రైపాక్షిక రక్షణ ఒప్పందంలో భాగస్వాములైన సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్థాన్ దేశాల ప్రతినిధులు ఇరాన్‌తో ప్రాంతీయ భద్రతపై చర్చలు జరిపారు. మధ్యప్రాచ్యంలో ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న సౌదీ అరేబియా, ఇరాన్ మధ్య తీవ్రమైన సున్నీషియా మతపరమైన విభేదాల నేపథ్యంలో దశాబ్దాలుగా ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, యుద్ధం మరింత విస్తరించకుండా అడ్డుకోవాలన్న ఉమ్మడి లక్ష్యం ఈ నాలుగు దేశాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. ఈ రెండు పరిణామాలు ఒక వాస్తవాన్ని గుర్తుచేస్తున్నాయి. జాతీయ ప్రయోజనాలు నిర్ణయాత్మకంగా మారినప్పుడు, మత, సైద్ధాంతిక విభేదాలను పక్కనపెట్టి ప్రత్యర్థులతోనూ సయోధ్య దిశగా అడుగులు వేయక తప్పదు.

మతపరమైన గుర్తింపులను రాజకీయ మద్దతు కూడగట్టుకునే సాధనాలుగా, దేశాల మధ్య మిత్రుత్వాలు లేదా శత్రుత్వాలను నిర్ణయించే ప్రాతిపదికలుగా ఉపయోగించినప్పుడు సమస్య తలెత్తుతుంది. సమకాలీన చరిత్రలో ఇటువంటి అనేక ఉదాహరణలను ప్రస్తావించుకోవచ్చు. ఇజ్రాయెల్‌పాలస్తీనా వివాదం ఇప్పటికే భారీ ప్రాణనష్టానికి దారితీస్తుండగా, మూడు మతాల వారికీ పవిత్రమైన జెరూసలేంలోని పవిత్ర స్థలాలకు ఉన్న ప్రాధాన్యం ఈ వివాదాన్ని మరింత సంక్లిష్టం చేస్తున్నది. అమెరికాలోని కొన్ని ఎవాంజెలికల్ క్రైస్తవ వర్గాలు బైబిల్ ప్రవచనాల నేపథ్యంలో ఇజ్రాయెల్ రాజ్య స్థాపనకు, దాని ఉనికికి మతపరమైన ప్రాధాన్యం ఆపాదిస్తూ ఆ దేశానికి భావోద్వేగపూరిత మద్దతు ఇస్తున్నాయి. క్రైస్తవ జియోనిజంగా గుర్తింపు పొందిన ఈ ధోరణి అంతర్జాతీయ రాజకీయాల్లో మత విశ్వాసాల ప్రభావాన్ని సూచిస్తున్నది. నాలుగున్నరేండ్లకు పైగా సాగుతున్న రష్యాఉక్రెయిన్ యుద్ధానికి మతం ప్రధాన కారణం కాకపోయినా, దేశీయంగా ప్రజల మద్దతు కూడగట్టుకోవడానికి, తన సైనిక చర్యలను సమర్థించుకోవడానికి సంప్రదాయ క్రైస్తవ నాగరికత పరిరక్షణ వంటి వాదనలను రష్యా నాయకత్వం ఉపయోగించుకుంటున్నది.

ప్రపంచవ్యాప్తంగా మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవడంపై, ప్రపంచ చర్చిల సమాఖ్య కేంద్ర కమిటీ మోడరేటర్ బిషప్ హెన్రిచ్ బెడ్‌ఫోర్డ్ స్ట్రామ్ అక్టోబర్ 13న ఆందోళన వ్యక్తం చేశారు. రష్యా అధ్యక్షుడు ఉక్రెయిన్‌పై సాగిస్తున్న యుద్ధాన్ని క్రైస్తవ వాదనలతో సమర్థించుకోవడాన్ని తప్పుబట్టారు. ఒక వివాదానికి మతపరమైన గుర్తింపు తోడైనా, మతమే ఘర్షణకు ప్రధాన కారణమైనా, అది ప్రభుత్వాల పరిధిని దాటి సంబంధిత దేశాల ప్రజల విశ్వాసాలు, భావోద్వేగాలతో ముడిపడుతుంది.

ఈ ధోరణి అంతర్జాతీయ సంబంధాలకే పరిమితం కావడం లేదు. భిన్న విశ్వాసాలకు చెందిన ప్రజలు నివసించే దేశాల్లో ఒక వర్గం గుర్తింపును రాజకీయ సమీకరణకు సాధనంగా మార్చడం ఇతర వర్గాల్లో అభద్రతను, అనుమానాలను పెంచుతుంది. చట్టం ముందు సమానత్వం వంటి ప్రజాస్వామ్య విలువలు బలహీనపడే ప్రమాదం ఏర్పడుతుంది. బౌద్ధమత ప్రాబల్యం కలిగిన మయన్మార్‌లో రోహింగ్యా ముస్లింలను వారి జాతి, మత గుర్తింపుల ఆధారంగా వివక్షకు గురిచేయడం, పౌరసత్వ హక్కులను నిరాకరించడం దశాబ్దాలుగా కొనసాగుతున్నది. ఆ దేశ సైన్యం, అరాకాన్ ఆర్మీ చేతుల్లో రోహింగ్యాలు ఎదుర్కొంటున్న హింసను ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం ఆగస్టు 25న విడుదల చేసిన నివేదిక కూడా ప్రస్తావించింది.

పాకిస్థాన్‌లో హిందూ, క్రైస్తవ మైనారిటీలకు చెందిన బాలికల అపహరణలు, బలవంతపు వివాహాలు, మత మార్పిడులు, అహ్మదీలపై దాడులు, మతదూషణ చట్టాల దుర్వినియోగం కొనసాగుతున్నాయని ఆ దేశ మానవ హక్కుల కమిషన్ అక్టోబర్ 15న విడుదల చేసిన నివేదిక పేర్కొన్నది. అహ్మదీలు తమను తాము ముస్లింలుగా గుర్తించుకున్నప్పటికీ, వారిని పాకిస్థాన్ రాజ్యాంగం ముస్లిమేతరులుగా పరిగణిస్తున్నది. ఈ రెండు ఉదాహరణలు మత ఛాందసత్వం, గుర్తింపు ఆధారిత వివక్ష కారణంగా మైనారిటీల హక్కులు, పౌరుల భద్రత, అంతర్గత సామరస్యం ఎలా దెబ్బతినవచ్చో తెలియజేస్తున్నాయి. మతపరమైన ఉద్రిక్తతలు దీర్ఘకాలం కొనసాగితే వాటి ప్రభావం ఆర్థిక వ్యవస్థపైనా పడుతుంది. పెట్టుబడుల్లో అనిశ్చితి పెరగడం, పర్యాటకం, వాణిజ్యం దెబ్బతినడం, ప్రభుత్వ వనరులు అభివృద్ధికి బదులుగా భద్రతా అవసరాలకు మళ్లడం వంటి పరిణామాలు చోటుచేసుకోవచ్చు. దేశాల విదేశంగ విధానాల్లో జాతీయ ప్రయోజనాలు మతపరమైన అనుబంధాలను అధిగమించిన సందర్భాలు సమకాలీన పరిణామాలకే పరిమితం కాలేదు. ఏడు దశాబ్దాల క్రితమే ఈ ధోరణి గోచరించింది. ఉదాహరణకు ముస్లిం సమాజంలో తనకంటూ బలమైన స్థానాన్ని కలిగి ఉన్న టర్కీ, 1952లో క్రైస్తవ మత ప్రభావం కలిగిన పాశ్చాత్య దేశాల ఆధిక్యమున్న నాటో రక్షణ కూటమిలో చేరింది. మత, నాగరికతాపరమైన బేధాలున్నప్పటికీ, ఆ కూటమిలో తన సభ్యత్వాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నది. పాశ్చాత్య దేశాలతో తనకున్న భద్రతా, వ్యూహాత్మక ప్రయోజనాలే ఇందుకు ప్రధాన కారణం. భిన్న విశ్వాసాల పట్ల గౌరవం భారతీయ సనాతన ఆలోచనా సంప్రదాయంలోనూ ప్రస్ఫుటమవుతుంది. ఋగ్వేదంలోని 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి' అనే వాక్యం 'సత్యం ఒక్కటే; జ్ఞానులు దానిని వివిధ రీతుల్లో వివరిస్తారు' అనే భావనను ప్రతిబింబిస్తుంది. అశోకుడి 12వ శిలాశాసనం.. తన సంప్రదాయం గురించి స్వోత్కర్ష చేసుకుంటూ ఇతరుల సంప్రదాయాలను అకారణంగా తక్కువ చేయవద్దని, వారి అభిప్రాయాలను వినాలని, పరస్పర గౌరవం పాటించాలని సూచించింది. భిన్నత్వాన్ని గౌరవించడం మన చరిత్రలో కేవలం తాత్విక భావనగానే కాకుండా, సహస్రాబ్దాల క్రితమే పాలనా సిద్ధాంతంగా కూడా సూత్రీకరణ జరిగిందని ఈ ఉదాహరణలు తెలియజేస్తున్నాయి. అందువల్ల, పాలనా నిర్ణయాలు రాజ్యాంగం, పౌరుల సమాన హక్కులు, ప్రజా సంక్షేమం, జాతీయ భద్రత వంటి అంశాల ఆధారంగా ఉండాలి. దేశాల మధ్య సంబంధాల్లోనూ మతపరమైన అనుబంధాల కంటే జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఛాందస ధోరణులు తాత్కాలికంగా రాజకీయ మద్దతును సమీకరించగలిగినా, వాటి ప్రభావంతో ఏర్పడే విభేదాలు ముదిరితే రాజీకి, తిరిగి సామరస్యాన్ని నెలకొల్పుకోవడానికి మార్గాలు క్రమంగా మూసుకుపోతాయి. విభేదాలు మొక్కగా ఉన్నప్పుడే పరిష్కరించుకోవడం సులభం; అవి మానుగా పెరిగి శాశ్వత శత్రుత్వంగా మారిన తర్వాత పరిస్థితి పూర్తిగా చేయి దాటిపోవచ్చు.

లద్దాక్ ప్రాంతాల్లో కరెంట్

శ్రీనగర్ : మనిషికి బలంగా అనుకుంటే ప్రకృతి కూడా సహకరిస్తుంది. ప్రతికూల పరిస్థితి కూడా చిన్నబోతుంది. ఎముకలు కొరికే చలి.. కనుచూపుమేర మంచుకొండలు.. అడుగు తీసి అడుగు వేయాలంటే కష్టం.. ఇలాంటి చోట కొంతమందికి పనే దైవం. విధి నిర్వహణే వారికి శిరోధార్యం ఇలాంటి ఇబ్బందుల్లో కూడా వారు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. ప్రజల ఇబ్బందులతో పోల్చితే.. ఇవి ఒక ఇబ్బందులా అని వారు అనుకున్నారు.. అంతేకాదు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రాణాల సైతం లెక్క చేయలేదు. దీనికి సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తోంది.జమ్ము కాశ్మీర్లోని లద్దాక్ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యాలను మరింత పెంపొందించేందుకు కార్మికులు కృషి చేస్తున్నారు. వారు చేస్తున్న పని ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలకు కూడా విద్యుత్ సదుపాయం కల్పించాలని లక్ష్యంతో అక్కడి ప్రభుత్వం అడుగులు వేస్తోంది ప్రభుత్వ లక్ష్యానికి తగ్గట్టుగా సిబ్బంది అత్యంత కఠినమైన వాతావరణంలో పని చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు మైనస్ 10 డిగ్రీలకు పడిపోయినప్పటికీ పనులు ఏమాత్రం ఆపడం లేదు.వందల అడుగుల ఎత్తులో విద్యుత్ స్తంభాలు.. లైన్లకు సంబంధించిన పనులు చేస్తున్నారు. చుట్టూ మంచుకొండలు.. కింద లోతైన లోయలు.. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా సరే ప్రమాదం జరిగే పరిస్థితులు.. అయినప్పటికీ కార్మికులు ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పనులు చేస్తున్నారు.లద్దాక్ ప్రాంతంలోని నుబ్రా ర్యాలీ.. సియాచిన్ గ్లేషియర్ వంటి ప్రాంతాలలో పనులు జరుగుతున్నాయి. సాధారణ సమయంలో విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయడమే చాలా శ్రమతో కూడుకుంటుంది. అలాంటిది మంచు ప్రాంతాలలో.. అత్యంత ఎత్తైన ప్రదేశాలలో విద్యుత్ సదుపాయం కల్పించడం అంటే మామూలు ఇబ్బంది కాదు. అక్కడి వాతావరణం ఇప్పుడు ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు. తీవ్రమైన చలి.. బలమైన గాలులు.. మంచు వల్ల పనులకు నిత్యం ఆటంకాలు కలుగుతూ ఉంటాయి. అయినప్పటికీ నిర్ణయించిన గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సిబ్బంది పనిచేస్తున్నారు.ఈ పనులకు సంబంధించిన వీడియోలు బయటికి వచ్చాయి. దీంతో చాలామంది కార్మికుల శ్రమను కొనియాడుతున్నారు. ప్రశంసలు కురిపిస్తున్నారు. మన ఇంట్లో వెచ్చగా ఉంటూ.. విద్యుత్ కాంతుల మధ్య జీవితాన్ని కొనసాగిస్తున్నామంటే.. దాని వెనుక ఇటువంటి కార్మికుల శ్రమ ఉంటుందని చాలా మంది వ్యాఖ్యానిస్తున్నారు. మైనస్ పది డిగ్రీల చలిలో.. వందల అడుగుల ఎత్తులో వారు చేస్తున్న ఈ సాహసానికి నిజంగా హాట్సాఫ్ చెప్పాల్సిందే.

ట్రంప్ ఓటమి.. ఓటమితో కుప్పకూలిన క్రూడాయిల్ ధరలు



న్యూయార్క్ : అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్ల జోరుకు అడ్డుకట్ట పడింది. హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ (ప్రతినిధుల సభ), సెనేట్‌లో డెమోక్రాట్లు మెజార్టీ సాధించడంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భారీగా పడిపోయాయి బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు ఏకంగా 118 డాలర్ల స్థాయిలో ఉండగా అది ఇప్పుడు 94 డాలర్ల మార్కు దిగొచ్చింది. ఈ క్రమంలో ఏకంగా 20 శాతానికిపైగా పడిపోవడం గమనార్హం. బుధవారం రాత్రి వేళనే ఏకంగా 10 శాతం పతనం అయ్యాయి. ఇప్పుడు గురువారం సెషన్ ఆరంభంలో కూడా ఇంకా పతనం అవుతూనే ఉంది. ఇది ఒక దశలో 93.46 డాలర్ల స్థాయి కనిష్ఠానికి పడిపోయింది.మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు గెలవడంతో ఇరాన్‌పై ట్రంప్ సైనిక చర్యలకు నిధుల కొరత ఏర్పడే అవకాశం ఉండటంతో, ఇరాన్ యుద్ధానికి త్వరలోనే ముగింపు పడనుందనే అంచనాలు మార్కెట్లో పెరిగాయి. దీంతో అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం ఖరారు కావొచ్చని భావిస్తున్నారు. ఇదే ఉద్రిక్తతల్ని తగ్గించడంతో, చమురు సరఫరా వ్యవస్థలో కూడా అంతరాయాలు తొలగిపోతాయన్న అంచనాలు పెరిగాయి. దీంతో క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా పడిపోయాయి.ఇంకా ఎన్నికలకు ముందే ట్రంప్ దీనిపై కీలక వ్యాఖ్యలు కూడా చేశారు. ఇరాన్ ఒక ఒప్పందాన్ని కోరుకుంటోందని, తాము కూడా అందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తాజాగా ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో సైనిక చర్యల కంటే ముందుగా దౌత్య మార్గాల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని చూస్తున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. యుద్ధాన్ని ముగించేందుకు ఖతార్ కూడా మధ్యవర్తిత్వం వహిస్తోంది. ఇటు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, సౌదీ, యూఏఈ, కువైట్, ఇరాక్ దేశాల ముడి చమురు ఎగుమతులన్నీ కలిపి అక్టోబరులో 10 శాతం పెరిగి రోజుకు 15.53 మిలియన్ బ్యారెళ్లకు చేరడం కూడా ధరల తగ్గుదలకు కారణమైంది. ఇదే మరిన్ని రోజులు కొనసాగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు కూడా తగ్గే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు.

పారా క్రీడల్లో భారత్ పతకాల ప్రభంజనం!



న్యూఢిల్లీ: జపాన్‌లో జరిగిన ఆసియా పారా గేమ్స్-2026లో భారత అథ్లెట్లు కనబరిచిన అద్భుత ప్రదర్శనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. పారా క్రీడల్లో భారత క్రీడాకారుల విజయాలు అంతర్జాతీయ క్రీడా రంగంలో దేశం సాధిస్తున్న ప్రగతికి నిదర్శనమని కొనియాడారు. 2010లో ఒక స్వర్ణ పతకంతో సహా 14 పతకాలు సాధించిన భారత్.. ఈసారి ఏకంగా 114 పతకాలను కైవసం చేసుకోవడం గొప్ప పరిణామమన్నారు. అథ్లెట్ల కఠోర శ్రమ, అంకితభావంతో పాటు దేశంలో బలోపేతమవుతున్న క్రీడా వ్యవస్థ ఈ విజయాలకు కారణమని పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పారా అథ్లెట్లతో మోదీ సమావేశమయ్యారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వారిని ఉద్దేశించి ప్రసంగించారు. "మిమ్మల్ని అందరినీ కలవాలని ఎంతో ఆసక్తిగా ఎదురుచూశాను. కొన్ని వారాల క్రితం ఆసియా క్రీడల్లో పాల్గొన్న అథ్లెట్లను కలిశాను. ఇప్పుడు ఆసియా పారా గేమ్స్‌లో సత్తా చాటిన క్రీడాకారులను కలుసుకోవడం ఆనందంగా ఉంది. అంతర్జాతీయ క్రీడా రంగంలో భారత శక్తిని మీ విజయాలు చాటిచెప్పాయి. ఒకప్పుడు పారా క్రీడల్లో భారత్ వెనుకబడి ఉండేది. 2010లో కేవలం 14 పతకాలు సాధించిన మన దేశం.. ఇప్పుడు 114 పతకాలతో సరికొత్త చరిత్ర సృష్టించింది. 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్య పతకాలతో పాటు ఐదు ప్రపంచ రికార్డులు, తొమ్మిది ఆసియా రికార్డులు సాధించి దేశాన్ని గర్వపడేలా చేశారు" అని మోదీ ప్రశంసించారు.

మహిళా అథ్లెట్లకు ప్రశంసలు

పారా గేమ్స్‌లో మహిళా అథ్లెట్లు కనబరిచిన ప్రతిభను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారత్ తరఫున పోటీపడిన 56 మంది మహిళా అథ్లెట్లలో 34 మంది పతకాలు సాధించడం విశేషమన్నారు. క్రీడల్లో మహిళల భాగస్వామ్యం, విజయాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

తల్లి జ్ఞాపకంతో రింకు భావోద్వేగం

జావెలిన్ త్రో అథ్లెట్ రింకు విజయాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. ఆసియా పారా గేమ్స్‌కు రెండు నెలల ముందే తల్లిని కోల్పోయిన రింకు.. తీవ్ర విషాదాన్ని దిగమింగుకుని పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించారని తెలిపారు. పతకం గెలిచిన అనంతరం తన తల్లి ఫొటోను చేతిలో పట్టుకుని ఆ విజయాన్ని ఆమెకు అంకితం చేయడం అందరినీ కదిలించిందన్నారు.

మారిన క్రీడా వ్యవస్థ

గతంలో క్రీడారంగంలో తగినన్ని వనరులు, ప్రోత్సాహం, పారదర్శకత లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లోకి పంపేందుకు ఆసక్తి చూపేవారు కాదని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పరిస్థితుల్లో మార్పు వస్తోందని, క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు వ్యవస్థ బలోపేతమవుతోందని చెప్పారు. నాలుగు క్రీడా విభాగాల్లో స్వర్ణం, రజతం, కాంస్యం.. మూడు పతకాలనూ భారత అథ్లెట్లే సాధించి పోడియంపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారని మోదీ తెలిపారు. పోటీల చివరి రోజున భారత క్రీడాకారులు తొమ్మిది స్వర్ణ పతకాలు సాధించడం విశేషమని కొనియాడారు.

అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది



ముంబై: మహారాష్ట్రలోని మహాయుతి ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. కొల్హాపూర్‌లోని గోకుల్ డెయిరీ సహకార సంస్థ ఎన్నికల్లో ప్రజా తీర్పును తారుమారు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. డైరెక్టర్ల బోర్డులో మెజారిటీ సాధించేందుకు ఎన్నికల అనంతరం నిబంధనలను మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ మేరకు గురువారం తన ఎక్స్ ఖాతాలో ఆయన పోస్టు చేశారు. "గోకుల్ డెయిరీ ఎన్నికల్లో పాల ఉత్పత్తిదారులు బీజేపీ కూటమిని ఓడించారు. అందుకే ఎన్నికల తర్వాత నిబంధనలను మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. బోర్డులో నలుగురు డైరెక్టర్లను నియమించి, 12 మందిని 16 మందిగా మార్చడం ద్వారా మెజారిటీని దక్కించుకోవాలని చూస్తున్నారు. ఇది పాల ఉత్పత్తిదారుల ఓట్లను దొంగిలించడమే. ప్రజా తీర్పును కల్తీ చేయడమే. అధికారాన్ని కాపాడుకోవడానికి బీజేపీ ఎంతకైనా తెగిస్తోంది. రైతుల ఓట్లను దొంగిలించే వారిని రైతాంగం ఎప్పటికీ మరచిపోదు" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్యానెల్‌కు 13 స్థానాలు

ఈ వ్యవహారంపై కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా చేసిన పోస్టును కూడా రాహుల్ గాంధీ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. అక్టోబర్ 19న జరిగిన గోకుల్ డెయిరీ ఎన్నికల్లో మొత్తం 25 స్థానాలకు పోటీ జరగగా, కాంగ్రెస్ నేత సతేజ్ పాటిల్ నేతృత్వంలోని ప్యానెల్ 13 స్థానాల్లో విజయం సాధించిందని పవన్ ఖేడా తెలిపారు. మహాయుతి కూటమి మద్దతున్న ప్యానెల్ 12 స్థానాలకే పరిమితమైందన్నారు. అయితే, డైరెక్టర్ల సమావేశానికి అవసరమైన కోరం లేకపోవడంతో ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడిందని పేర్కొన్నారు. మహాయుతి మద్దతున్న డైరెక్టర్లు సమావేశాలకు హాజరు కాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో నవంబర్ 10న తిరిగి ఎన్నికలు నిర్వహించాలని బాంబే హైకోర్టు ఆదేశించినట్లు వెల్లడించారు.

నామినేటెడ్ సభ్యుల నియామకంపై వివాదం

ఎన్నికైన డైరెక్టర్ల బోర్డు కార్యకలాపాలను ప్రభావితం చేసేలా మహారాష్ట్ర మంత్రివర్గం కొత్త ప్రతిపాదనకు ఆమోదం తెలిపిందని పవన్ ఖేడా ఆరోపించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను మినహాయించి, రూ.500 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ కలిగిన సహకార సంస్థల మేనేజింగ్ కమిటీల్లో ఐదుగురు ప్రభుత్వ నామినేటెడ్ సభ్యులను నియమించే ప్రతిపాదన తీసుకొచ్చిందన్నారు. వీరిలో నలుగురికి ఓటు హక్కు కల్పించే నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రభావితం అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సహకార సంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడేందుకు న్యాయపోరాటం చేస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

ఓటరు కార్డుపై కాంగ్రెస్ అభ్యంతరం

ఇదిలా ఉండగా, సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ఆధార్‌తో పాటు ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్)ను ఉపయోగించాలన్న కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వ్యాఖ్యలపైనా కాంగ్రెస్ స్పందించింది. ఓట్ల చోరీ కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు కథ హక్కుల చోరీ అని విమర్శించింది. ఈ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ స్పందిస్తూ, సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపునకు ఆధార్‌కు బదులుగా ఓటరు గుర్తింపు కార్డును ఉపయోగించాలన్న ప్రతిపాదనపై ప్రశ్నలు లేవనెత్తారు. కేంద్ర ప్రభుత్వ అధికారిక విధానం ఇదేనా అని నిలదీశారు.

ధైర్యముంటే ప్రధానికి లేఖ రాయండి



కర్నాల్: ఎస్ఐఆర్, ఈవీఎంల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీతో బహిరంగ చర్చకు రావాలంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన సవాల్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. చర్చించాలనే చిత్తశుద్ధి, ధైర్యం ఉంటే ప్రధానమంత్రికి అధికారికంగా లేఖ రాయాలని సూచించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలు, చొరబాటుదారుల అంశాలపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. హరియాణాలోని కర్నాల్‌లో బీజేపీ నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో.. అరాజకత హఠావో' యాత్రలో ఆయన ప్రసంగించారు.

రాహుల్‌పై అమిత్ షా విమర్శలు

పార్లమెంట్‌ను సజావుగా నడవనివ్వకుండా బయట రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరిగితే సరిపోదని, ప్రవర్తన కూడా రాజ్యాంగబద్ధంగా ఉండాలని అమిత్ షా వ్యాఖ్యానించారు. పార్లమెంట్‌లో చర్చలకు సహకరించకుండా వాకౌట్లు, ఆందోళనలకు దిగడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. మృతుల పేర్లతో పాటు బంగ్లాదేశ్ చొరబాటుదారులు, రోహింగ్యాల పేర్లతో ఉన్న బోగస్ ఓట్లను ఎన్నికల సంఘం తొలగిస్తుంటే కాంగ్రెస్‌కు అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. చొరబాటుదారులే కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుగా ఉన్నారని, అందుకే ఓటర్ల జాబితా ప్రక్షాళనను అడ్డుకునేందుకు 'ఓట్ల చోరీ' అంటూ ప్రచారం చేస్తోందని ఆరోపించారు. దేశ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని, చొరబాటుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని అన్నారు.

పార్లమెంట్ చర్చలకు సహకరించాలి

ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ అత్యున్నత చర్చా వేదిక అని అమిత్ షా పేర్కొన్నారు. కీలక అంశాలపై అక్కడ చర్చించకుండా కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. పార్లమెంట్‌ను పనిచేయనివ్వకుండా బయట ఆందోళనలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. దేశంలోని పార్లమెంట్, శాసనసభలు, గ్రామాలు, పొలాల్లోనూ బీజేపీ కాంగ్రెస్‌కు తగిన సమాధానం ఇస్తుందని అన్నారు. ప్రజలను సమీకరించి ఆందోళనలు చేయాలని కాంగ్రెస్ భావిస్తే ఎదుర్కొనేందుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ఓటు హక్కు విలువను వివరించిన సైనీ

హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ కూడా కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యానికి సామాన్య పౌరుడి ఓటే అతిపెద్ద బలమని పేర్కొన్నారు. సంపద, పలుకుబడి, రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా పోలింగ్ బూత్‌లో ప్రతి ఒక్కరికీ సమాన ఓటు హక్కు ఉంటుందని వివరించారు. రైతులు, కార్మికులు, యువత, మహిళల ఆకాంక్షలకు ఓటు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టే ఓటర్ల జాబితా సవరణ సాధారణ ప్రక్రియేనని సైనీ పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ అసత్య ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మహిళలు, యువత, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని బీజేపీ నేతలు పేర్కొన్నారు.

చర్చకు సిద్ధమన్న రాహుల్

కాగా, అంతకుముందు రాహుల్ గాంధీ ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. దేశంలోని 73 శాతం మంది యువత తమ మధ్య చర్చ జరగాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రధాని ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదని, కీలక దేశీయ అంశాలపై చర్చించేందుకు ముందుకు వస్తే చాలన్నారు. నిరుద్యోగం, దేశ భద్రత, ఆర్థిక వ్యవస్థ వంటి ప్రజా సమస్యలపై దేశంలోని ఇద్దరు అగ్రనేతలు ఒకే వేదికపై చర్చించడం ప్రజాస్వామ్యానికి అవసరమని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు.

దేశవ్యాప్తంగా వందే భారత్ హవా..

దేశంలో ప్రవేశపెట్టిన సెమీ-హై-స్పీడ్ రైళ్లు వందే భారత్ సర్వీసులకు ప్రయాణికుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ రైళ్ల ఆక్యుపెన్సీ గణాంకాలు వాటి విజయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా, తిరువనంతపురం సెంట్రల్-మంగళూరు సెంట్రల్ మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఏకంగా 189.35% ఆక్యుపెన్సీతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచి సరికొత్త రికార్డు సృష్టించింది. రైల్వే బోర్డు అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం, దేశవ్యాప్తంగా నడుస్తున్న అన్ని వందే భారత్ చైర్ కార్ సర్వీసుల్లో కలిపి సగటు ఆక్యుపెన్సీ 99.10%గా నమోదైంది. జనవరి 2026లో ప్రారంభమైన తొలి వందే భారత్ స్లీపర్ రైలు (హౌరా-కామాఖ్య) కూడా ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ రైలులో ఏకంగా 114.54% ఆక్యుపెన్సీ నమోదైనట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తన కథనంలో పేర్కొంది. ఆక్యుపెన్సీలో రికార్డు సృష్టించిన తిరువనంతపురం-మంగళూరు రూట్‌లో, తిరువనంతపురం నుంచి మంగళూరు వెళ్లే రైలు (20632) 189.35% ఆక్యుపెన్సీ నమోదు చేయగా, మంగళూరు నుంచి తిరువనంతపురం వచ్చే రైలు (20631) 174.77% ఆక్యుపెన్సీ సాధించింది. 100% కంటే ఎక్కువ ఆక్యుపెన్సీ ఉండటం అంటే, అందుబాటులో ఉన్న సీట్ల కంటే ఎక్కువ మంది ప్రయాణికులు వెయిటింగ్ లిస్ట్‌లో ఉండి ప్రయాణించడానికి సిద్ధంగా ఉన్నారని అర్థం. ఇది ఈ రూట్లలో డిమాండ్ ఏ స్థాయిలో ఉందో సూచిస్తోంది. అదేవిధంగా, ఢిల్లీ-వారణాసి మధ్య నడిచే రెండు జతల వందే భారత్ చైర్ కార్ సర్వీసులు కూడా 114% నుంచి 117% పైగా ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి.

కొత్తగా స్లీపర్ సర్వీసులు:

వందే భారత్ రైళ్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ మరిన్ని స్లీపర్ సర్వీసులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. కర్ణాటకకు రెండో వందే భారత్ స్లీపర్ రైలును కేటాయించినట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవల ప్రకటించారు. ఈ రైలు బెంగళూరు నుంచి హుబ్బళ్లి మీదుగా ముంబై వరకు నడవనుంది. దీనివల్ల ఉత్తర కర్ణాటక, పుణె, ముంబై నగరాల మధ్య ప్రయాణం సులభతరం కానుంది. కాగా, ఢిల్లీ-వారణాసి మార్గంలో అక్టోబర్ 31, 2026న ఒక వందే భారత్ స్లీపర్ రైలును ఇప్పటికే ప్రారంభించారు. 2019లో ప్రారంభమైన వందే భారత్ సేవలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 160కి పైగా సర్వీసులకు విస్తరించాయి.

ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ



న్యూఢిల్లీ: ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల వార్షిక ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా యువతకు ఓటరు జాబితాలో చోటు కల్పించడం ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని వెల్లడించింది. ఇందుకోసం అవసరమైన సిబ్బందిని సమకూర్చాలని ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాసింది. నకిలీ ఓటరు ఎంట్రీలు, ఒకే వ్యక్తి పేరుతో పలుచోట్ల ఓట్లు ఉన్నాయనే ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని ఆదేశించింది.

నవంబర్ 30న ముసాయిదా జాబితా

అరుణాచల్‌ప్రదేశ్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలీ, డామన్ అండ్ డయ్యూ, మిజోరం, ఒడిశా, సిక్కింలలో ఈ ప్రత్యేక సంక్షిప్త సవరణ చేపట్టనున్నారు. 2027 ఏప్రిల్ 1, జులై 1, అక్టోబర్ 1 తేదీల నాటికి ఓటు హక్కు పొందే అర్హత కలిగిన వారి నుంచి ముందస్తు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అభ్యంతరాలు, దరఖాస్తుల పరిశీలన అనంతరం నవంబర్ 30న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. 2027 జనవరి 21న తుది జాబితాను ప్రకటించనున్నారు.

ఆధార్ తప్పనిసరి కాదు

కొత్త ఓటరు నమోదుకు ఉపయోగించే ఫారం-6, వివరాల మార్పులు, చేర్పుల కోసం వినియోగించే ఫారం-8లో ఆధార్ వివరాలు సమర్పించడం పూర్తిగా స్వచ్ఛందమని ఈసీ స్పష్టం చేసింది. ఆధార్ వివరాలు ఇవ్వలేదనే కారణంతో ఏ దరఖాస్తునూ తిరస్కరించరాదని, ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్న వారి పేర్లను తొలగించరాదని పేర్కొంది.

ఓట్ల తొలగింపుపై నిఘా

ఒకే వ్యక్తి పేరు పలుమార్లు నమోదైందనే కారణంతో ఓట్లను తొలగించే ముందు క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరి చేసింది. ఒక పోలింగ్ కేంద్రం పరిధిలో రెండు శాతానికి మించి ఓట్ల తొలగింపులు ఉన్నా, ఒకే వ్యక్తి ఐదు కంటే ఎక్కువ అభ్యంతరాలు వ్యక్తం చేసినా సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు) స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని ఆదేశించింది.

పది రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ

మరోవైపు, పది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) షెడ్యూల్‌ను తర్వాత ప్రకటించనున్నట్లు ఈసీ తెలిపింది. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, హరియాణా, ఝార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మేఘాలయ, నాగాలాండ్, ఢిల్లీ, త్రిపుర, తెలంగాణ రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఎస్ఐఆర్ ఇంకా ప్రారంభం కాని హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లలో వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను విడిగా ప్రకటించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

ఐటీ విభాగం పర్యవేక్షణలో మార్పు

ఇదిలా ఉండగా, ఎన్నికల సంఘం ఐటీ విభాగం అంతర్గత రిపోర్టింగ్ వ్యవస్థలో మార్పులపై ఓ అధికారి స్పష్టతనిచ్చారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎప్పటిలాగే డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ పర్యవేక్షణలోనే ఉంటారని తెలిపారు. బుధవారం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం, ప్రస్తుత డీజీ (ఐటీ) సెర్మా ఖన్నా ఇకపై కొత్తగా నియమితులైన డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ప్రకాశ్ రాజ్ పురోహిత్ పర్యవేక్షణలో పనిచేయనున్నారు. ఈ మార్పుతో పర్యవేక్షణ వ్యవస్థలో ప్రాథమిక నిబంధనలు మారలేదని అధికారి వివరించారు.

విదేశీయుల పాస్‌పోర్ట్, వీసా నిబంధనల్లో సడలింపు

న్యూఢిల్లీ: భారత్‌లో నివసిస్తున్న పలు వర్గాల విదేశీ పౌరులకు కేంద్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. నిర్దిష్ట అర్హతలు కలిగిన పాకిస్థాన్ పౌరులు, మతపరమైన వేధింపుల కారణంగా భారత్‌కు వచ్చిన మైనార్టీ శరణార్థులు, శ్రీలంక తమిళులు, టిబెటన్లకు పాస్‌పోర్ట్, వీసా నిబంధనల నుంచి ప్రత్యేక మినహాయింపులు కల్పించింది. భారత్-నేపాల్--భూటాన్ మధ్య ప్రయాణించే పౌరుల గుర్తింపు పత్రాల నిబంధనల్లోనూ మార్పులు చేసింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నవంబర్ 5న 'ది ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ (ఎగ్జెంప్షన్) (అమెండ్‌మెంట్) ఆర్డర్--2026'ను గెజిట్‌లో ప్రచురించింది.

పాక్ పౌరులకు ప్రత్యేక వెసులుబాటు

2009 డిసెంబర్ 31 లేదా అంతకంటే ముందే శాశ్వత నివాసం ఏర్పరచుకునే ఉద్దేశంతో పాకిస్థాన్ నుంచి భారత్‌కు వచ్చిన పౌరులకు కేంద్రం ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. పాకిస్థాన్ ప్రభుత్వం జారీ చేసే కంప్యూటరైజ్డ్ నేషనల్ ఐడెంటిటీ కార్డు (సీఎన్ఐసీ) లేకపోవడంతో పాస్‌పోర్టును పునరుద్ధరించుకోలేని వారు ఈ వెసులుబాటు పొందవచ్చు. అయితే భారత్‌లో కొనసాగి ఉండేందుకు తగిన కేటగిరీ వీసా పొందాల్సి ఉంటుంది.

కేరళలో స్థిరపడిన వారికి మరో మినహాయింపు

విభజన అనంతరం 1947 ఆగస్టు 15 నుంచి 1965 డిసెంబర్ 31 మధ్య పాకిస్థాన్‌కు వెళ్లిన భారతీయ మూలాలున్న ముస్లిం పురుషుల్లో కొందరికి కూడా మినహాయింపు కల్పించారు. వారు 2009 డిసెంబర్ 31లోపు పాకిస్థాన్ పాస్‌పోర్టుపై తిరిగి భారత్‌కు వచ్చి కేరళలో స్థిరపడి ఉండాలి. పాకిస్థాన్‌లో ఉన్నప్పుడు వివాహం చేసుకోకపోవడం, అక్కడ స్థిరాస్తులు కొనుగోలు చేయకపోవడం, భారత్‌లో భారత పౌరులుగా ఉన్న కుటుంబ సభ్యులను వదిలి వెళ్లి ఉండటం వంటి షరతులు వర్తిస్తాయి. ఇకపై పాకిస్థాన్‌కు తిరిగి వెళ్లబోమని హామీ ఇవ్వాలి. పోలీసు, భద్రతా సంస్థల నుంచి ప్రతికూల నివేదికలు ఉండకూడదు.

భారత మూలాలున్న మలేసియా, సింగపూర్ పౌరులకూ

గతంలో భారత పాస్‌పోర్టు కలిగి ఉన్నవారు లేదా వారి తల్లిదండ్రులు, తాతముత్తాతలు భారతదేశంలో జన్మించి శాశ్వత నివాసితులుగా ఉన్నవారిని భారత మూలాలున్న వ్యక్తులుగా (పీఐఓ) పరిగణిస్తారు. అయితే పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్గానిస్థాన్, నేపాల్, భూటాన్, చైనా పౌరులకు ఈ నిర్వచనం వర్తించదు. మలేసియా లేదా సింగపూర్ పౌరసత్వం పొందిన భారత మూలాలున్న వ్యక్తులు 2009 డిసెంబర్ 31లోపు ఆయా దేశాల పాస్‌పోర్టులపై భారత్‌కు తిరిగి వచ్చి ఉండాలి. ఆ దేశాల నిబంధనల ప్రకారం పాస్‌పోర్టు పునరుద్ధరణకు అర్హత లేకపోవడంతో గడువు ముగిసిన వారికి కూడా మినహాయింపు వర్తిస్తుంది. అయితే భారత మూలాలను నిరూపించే పత్రాలు ఉండాలి. వీరంతా భారత్‌లో కొనసాగేందుకు తగిన వీసా పొందాలి.

మైనార్టీ శరణార్థులకు ఊరట

అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌కు చెందిన హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతస్థులకు కూడా కేంద్రం మినహాయింపులు ఇచ్చింది. మతపరమైన వేధింపులు లేదా వాటి భయంతో 2024 డిసెంబర్ 31 లేదా అంతకంటే ముందుగా భారత్‌కు వచ్చిన వారికి ఈ వెసులుబాటు వర్తిస్తుంది. సరైన పాస్‌పోర్టు, ప్రయాణ పత్రాలు లేకుండా వచ్చినవారితో పాటు వాటి గడువు ముగిసిన వారికి కూడా మినహాయింపు ఉంటుంది. అయితే భారత్‌లో కొనసాగేందుకు తగిన కేటగిరీ వీసా తప్పనిసరిగా పొందాలి.

శ్రీలంక తమిళులు, టిబెటన్లకూ మినహాయింపు

2015 జనవరి 9 లేదా అంతకంటే ముందు భారత్‌లో ఆశ్రయం పొందిన, సంబంధిత ప్రభుత్వ అధికారుల వద్ద నమోదు చేసుకున్న శ్రీలంక తమిళులకు పాస్‌పోర్టు, వీసా నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ

విజయవాడ, మహానగర్

రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ తెలిపారు. గురువారం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని రైల్వే వాగన్ వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంతో పాటు విజయవాడ రూరల్ మండలం పాతపాడు, గన్నవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్లకు కల్పించిన సౌకర్యాలు, పోలింగ్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఓటర్లతో మాట్లాడి పోలింగ్ సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అన్ని ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని, ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని ఓటర్లు, పోలింగ్ సిబ్బంది తెలిపినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారని, జిల్లా యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సమర్థవంతంగా చేపట్టిందని తెలిపారు. రాజకీయ పార్టీలు కూడా తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటల్లోపు పోలింగ్ పూర్తవుతుందని ఆశిస్తున్నామని, అనంతరం బ్యాలెట్ బాక్సులను పటిష్ట భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి, రిసెప్షన్ కేంద్రాల్లో అవసరమైన లాంఛనాలు పూర్తిచేసిన తర్వాత భద్రపరుస్తామని వివరించారు. తాను సందర్శించిన అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ నిఘా ఉందని, స్ట్రాంగ్ రూమ్‌లలోనూ నిరంతర పర్యవేక్షణకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కృష్ణా జిల్లా ఎన్నికల పరిశీలకుడు వి. అభిషేక్‌తోనూ ఎన్నికల సరళిపై చర్చించారు. పోలింగ్ ముగియడానికి సమయం ఉన్నందున ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



కార్తీక మాసం, భవానీ దీక్ష ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఈ నెల 10 నుంచి కార్తీక మాస ప్రత్యేక పూజలు
20 నుంచి భవానీ దీక్షాధారణలు



విజయవాడ, మహానగర్

ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు, భగినీ హస్తభోజనం సందర్భంగా అమ్మవారి గాజుల అలంకారోత్సవం, వార్షిక భవానీ దీక్ష ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం పరిపాలనా భవనంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నవంబర్ 10 నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాసంలో ఆకాశదీపం, నిత్య అభిషేకాలు, బిల్వార్చనలు, కార్తీక పౌర్ణమి కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం కార్యక్రమాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని సూచించారు. నవంబర్ 11న భగినీ హస్తభోజనం సందర్భంగా కనకదుర్గ అమ్మవారి గాజుల అలంకారోత్సవ దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్లలో సౌకర్యాలు, ప్రసాద వితరణలో ప్రాధాన్యత కల్పించాలన్నారు. నవంబర్ 20 నుంచి భవానీ దీక్షాధారణలు, డిసెంబర్ 24న కలశజ్యోతి మహోత్సవం, డిసెంబర్ 30 నుంచి జనవరి 3 వరకు దీక్షా విరమణల నేపథ్యంలో లక్షలాది మంది భక్తులకు అవసరమైన కేశఖండనశాలలు, స్నానఘట్టాలు, తాగునీరు, అన్నప్రసాదం, లడ్డూ ప్రసాద నిల్వలు, హోమగుండాల వద్ద భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో దేవస్థానం అధికారులు, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

కమాన్ పూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది అని బి ఆర్ ఎస్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాటికొండ శంకర్ అన్నారు. గురువారం వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఎంపీడీవో మరియు తహసిల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు.కమాన్ పూర్ మండల పరిధిలో వరి పంటలు కోతల సమయం వచ్చినప్పటికి దాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గురువారం బీఆర్ఎస్ నాయకులు ర్యాలీగా ప్రభుత్వ మండల ప్రజా పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకుని త్వరితగతిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల విక్రయ ఇబ్బందులు తొలిగించాలని కోరుతూ.. తహసీల్దార్ వాసంతికీ, ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. మండలంలో వరి కోతలు జరుగుతున్నప్పటికి కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దాన్యం విక్రయించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో మధ్య దళారులను ఆశ్రయించి రైతులు నష్టపోయే పరిస్థితి నెలకుందన్నారు. ప్రక్కన పెద్దపల్లి నియోజకవర్గంలో గత వారం రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికి మంత్రి శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలోని కమాన్ పూర్ మండలంలో ఇప్పటికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా మండలం పరిధిలో సెర్ప్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లేని యెడల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేయట్వాల్సి వస్తుందని హెచ్చరించారు.

మంచి నీటి బోరు మోటార్ ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ : నగర ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి, త్రాగు నీటి వసతి సౌకర్యాల కల్పనలో భాగంగా గురువారం 31 వ డివిజన్ దుర్గమ్మగడ్డ హనుమాన్ దేవాలయాన్ని సందర్శించారు. దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేత పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం స్థానిక కార్పోరేటర్ ముఖద్దర్ హుస్సేన్ అలీతో కలిసి మంచి నీటి బోరు మోటారును అధికారికంగా ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... నగరంలోని ప్రతి డివిజన్ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మా పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రస్తుత ఎల్ నినో ప్రభావం, రానున్న వేసవి కాలం దృష్ట్యా... నగర ప్రజల త్రాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నగరంలో ప్రజల త్రాగు నీటి సరఫరా లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తున్నట్లు తెలిపారు.

ఏపీఈఆర్సీ చైర్‌పర్సన్‌గా బినోయ్ కుమార్ ప్రమాణ స్వీకారం



అమరావతి, మహానగర్:

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) చైర్‌పర్సన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి బినోయ్ కుమార్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3వ తేదీన జీఓఎంఎస్ నంబర్ 87 ద్వారా ఆయనను ఏపీఈఆర్సీ చైర్‌పర్సన్‌గా నియమించింది. ఈ నేపథ్యంలో విజయవాడలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఐదేళ్ల పాటు లేదా 70 ఏళ్ల వయస్సు వచ్చే వరకు, ఈ రెండింటిలో ఏది ముందైతే అప్పటి వరకు ఆయన పదవిలో కొనసాగనున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బినోయ్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌తో పాటు పలువురు అధికారులు కూడా ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఎండీ నాగలక్ష్మి, సీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్, ఏపీఈఆర్సీ సభ్యుడు పీవీఆర్ రెడ్డి, ఏపీ నెరెడ్కాప్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కమలాకర్ బాబు, ఏపీఈఆర్సీ కార్యదర్శి పి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవాగు వరదలో చిక్కుకున్న 22 మంది కూలీలు సురక్షితం

ఎమ్మెల్యే చిర్రీ బాలరాజు, జిల్లా కలెక్టర్ చొరవతో సహాయక చర్యలు
రక్షణ చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది



ఏలూరు, మహానగర్

పెద్దవాగు వరద ఉధృతిలో చిక్కుకున్న 22 మంది కూలీలను జిల్లా యంత్రాంగం, ఎమ్మెల్యే చిర్రీ బాలరాజు చొరవతో అధికారులు సురక్షితంగా రక్షించారు. బుట్టాయిగూడెం మండలం రెడ్డిగణపవరం, కనకపురం గ్రామాలకు చెందిన 22 మంది కూలీలు పామాయిల్ తోటల్లో పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం వంతెన వద్దకు చేరుకున్నారు. అప్పటికే పెద్దవాగు వరద ఉధృతికి వంతెన రహదారి కొట్టుకుపోవడంతో వారు వరద నీటిలో చిక్కుకుపోయారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే చిర్రీ బాలరాజు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కలెక్టర్ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందంతో పాటు స్థానిక పోలీస్, రెవెన్యూ సిబ్బంది రంగంలోకి దిగి జేసీబీ సహాయంతో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న కూలీలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అనంతరం వారిని బుట్టాయిగూడెంలోని తుఫాను పునరావాస కేంద్రానికి తరలించి ఆహారం అందించడంతో పాటు వైద్య సహాయం కల్పించారు. కూలీలందరూ సురక్షితంగా బయటపడే వరకు జిల్లా కలెక్టర్ సహాయక చర్యలను పర్యవేక్షించారు. తమ ప్రాణాలను కాపాడిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చిర్రీ బాలరాజు, జిల్లా యంత్రాంగానికి కూలీలు కృతజ్ఞతలు తెలిపారు. ఆపద సమయంలో తక్షణమే స్పందించి తమను రక్షించిన అధికారులకు జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

లిస్టింగ్ తర్వాత ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియాకు అత్యధిక వృద్ధి

విజయవాడ, మహానగర్

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ 2027 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ అయిన తర్వాత అత్యధిక వార్షిక వృద్ధిని నమోదు చేసింది. వరుసగా రెండో త్రైమాసికంలోనూ రెండంకెల వృద్ధిని సాధించింది. ఈ మేరకు సంస్థ గురువారం ప్రకటించిన ఆర్థిక ఫలితాల ప్రకారం కార్యకలాపాల ద్వారా రూ.7,380 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.6,174 కోట్లతో పోలిస్తే ఆదాయం 19.5 శాతం పెరిగింది. ఈబీఐటీడీఏ 28 శాతం వృద్ధితో రూ.701 కోట్లకు చేరగా, పన్నుల అనంతర లాభం (పీఏటీ) 25.7 శాతం పెరిగి రూ.489 కోట్లుగా నమోదైంది. ఈబీఐటీడీఏ మార్జిన్ 63 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 9.5 శాతానికి చేరుకుంది. కమోడిటీల ధరల పెరుగుదల, రూపాయి విలువ తగ్గడం, పండుగల సీజన్ డిమాండ్‌ను అందిపుచ్చుకునేందుకు మార్కెటింగ్, విక్రయాలపై పెట్టుబడులు పెంచినప్పటికీ సంస్థ లాభదాయకతను మెరుగుపరుచుకుంది. ఈ ఫలితాలపై ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ హాంగ్ జూ జియోన్ మాట్లాడుతూ వరుసగా రెండో త్రైమాసికంలోనూ మెరుగైన ఫలితాలు సాధించడం, తొలి ఆరు నెలల్లో పటిష్ఠమైన పనితీరు కనబరచడం సంతోషంగా ఉందన్నారు. పెరుగుతున్న ప్రజల ఆదాయం, ప్రీమియం ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణ, మెట్రో నగరాలతో పాటు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో వ్యాపార విస్తరణ సంస్థ వృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు. వాటాదారుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ దీర్ఘకాలిక విలువను సృష్టించడమే లక్ష్యమన్నారు. కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్‌తో పాటు బీ2బీ రంగంలోనూ విస్తరిస్తూ వెహికల్ సొల్యూషన్స్ అనే కొత్త విభాగంలోకి ప్రవేశిస్తున్నట్లు వెల్లడించారు. మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ఇండియా, మేక్ ఇండియా గ్లోబల్ వ్యూహాలతో దేశీయ, ఎగుమతి మార్కెట్లలో వృద్ధి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్వగ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్న సుజనా చౌదరి



విజయవాడ, మహానగర్

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి) గురువారం తన స్వగ్రామమైన పొన్నవరంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు వజ్రాయుధం వంటిదని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి నిస్వార్థంగా పనిచేసే నాయకులను ఎన్నుకునేందుకు ఓటు చక్కటి అవకాశమని తెలిపారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని, కూటమి పట్ల ప్రజల్లో ఉత్సాహం, సానుకూల స్పందన కనిపిస్తోందని సుజనా చౌదరి పేర్కొన్నారు.

ఎమ్మెల్యే సుజనా చౌదరితో వంగవీటి రాధాకృష్ణ భేటీ



విజయవాడ, మహానగర్

నగర మేయర్‌గా విజయం సాధించిన వంగవీటి రాధాకృష్ణ గురువారం విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. కానూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఎమ్మెల్యే సుజనా చౌదరితో పాటు రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి జి.వి. కృష్ణారావు రాధాకృష్ణను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విజయవాడ నగర అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని ఈ సందర్భంగా సుజనా చౌదరి ఆకాంక్షించారు.

ప్రేమ సందడితో మంగ్లీ పాట



హైదరాబాద్, మహానగర్

ప్రముఖ జానపద గాయని మంగ్లీ తన ఉత్సాహభరితమైన గాత్రంతో మరోసారి ప్రేక్షకులను అలరించనున్నారు. వార్నర్ మ్యూజిక్ ఇండియా రూపొందిస్తున్న 'మాటి సీజన్ 2'లో భాగంగా 'పోడా ఓ చందు' అనే తెలుగు జానపద గీతాన్ని విడుదల చేశారు. ప్రేమలోని చిలిపితనం, ఆకర్షణ, మధురానుభూతులను ప్రతిబింబించేలా ఈ పాటను రూపొందించారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందించగా, కాసర్ల శ్యామ్ సాహిత్యాన్ని సమకూర్చారు. గ్రామీణ వాతావరణం, స్థానిక వాయిద్యాలు, వేణువు, ఈలలతో పాటకు ప్రత్యేక జానపద శోభను తీసుకొచ్చారు. మంగ్లీ గాత్రం, నృత్యరీతులు, రంగురంగుల దృశ్యాలు వీడియోకు ఆకర్షణగా నిలిచాయి. ఈ పాట పండుగ వేళ ప్రేక్షకులను ఉత్సాహంగా నృత్యం చేసేలా చేస్తుందని మంగ్లీ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాంతీయ జానపద సంగీత సహజత్వాన్ని కాపాడుతూ ఈ బాణీని రూపొందించామని సురేష్ బొబ్బిలి తెలిపారు. ప్రముఖ ఆడియో, వీడియో స్ట్రీమింగ్ వేదికల్లో పాట అందుబాటులో ఉంది.

బిజినెస్

దలాల్ స్ట్రీట్‌లో దివాళీ ధమాకా..
దూసుకెళ్తున్న స్టాక్‌మార్కెట్లు..
ఇన్వెస్టర్లకు 7 లక్షల కోట్ల బొనాంజా



ముంబై: దలాల్ స్ట్రీట్‌లో ఇవాళ దివాళీ ధమాకా మొదలైంది. ట్రేడింగ్‌లో స్టాక్‌మార్కెట్లు రఫాడిస్తున్నాయి. సెన్సెక్స్ 1600 పాయింట్లతో దూసుకెళ్తోంది. ఇక నిఫ్టీ తన ట్రేడింగ్‌లో ఇవాళ ఉదయం రెండు శాతం లాభాలను చూపించింది. స్టాక్‌మార్కెట్ల జోష్‌తో ఇన్వెస్టర్ల సంపద పెరిగింది. సుమారు 7 లక్షల కోట్ల లాభాలు పెట్టుబడిదారులకు చేరినట్లు ట్రేడింగ్ ద్వార తెలుస్తోంది. ముడి చమురు ధరలు తగ్గడం, అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల తర్వాత విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోలు శక్తి పెరిగినట్లు తెలిసింది. 30 షేర్ల బాంబే స్టాక్ ఎక్స్‌చేంజ్‌లో ఇవాళ 2.08 శాతం పెరుగుదల కనిపించింది. మొత్తం 1609.54 పాయింట్లు దూసుకెళ్లింది. ఇక నిఫ్టీ50 417.45 పాయింట్ల లాభాల్లో ట్రేడ్ అయ్యింది. నిఫ్టీ షేర్లు 1.74 శాతం వృద్ధి సాధించాయి. బుధవారం స్టాక్‌మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఆ జోరే ఇవాళ ఉదయం కూడా కొనసాగింది.

ట్రంప్ ఓటమితో స్టాక్‌మార్కెట్లకు జోష్..
సెన్సెక్స్ 2,100 పాయింట్లు జంప్..!



దేశీయ స్టాక్ మార్కెట్లలో గురవారం లాభాల జోరు కొనసాగుతున్నది. అమెరికా ఎన్నికల ఫలితాలు, అంతర్జాతీయ పరిణామాలతో వరుసగా ఆరోరోజు కూడా సూచీలు లాభాల్లో దూసుకెళ్తున్నాయి. ముఖ్యంగా ముడిచమురు ధరల పతనం మార్కెట్లకు మరింత ఉత్సాహాన్నిస్తున్నది. దాంతో గురువారం నాటి ట్రేడింగ్‌లో సూచీలు భారీ లాభాల్లో కొనసాగుతున్నాయి. సెన్సెక్స్ ఏకంగా 2100 పాయింట్లకుపైగా ఎగబాకింది. నిఫ్టీ 24,500 మార్క్ పైన కదలాడుతున్నది. మధ్యాహ్నం 2.00 గంటల సమయంలో సెన్సెక్స్ 2,124 పాయింట్లు పెరిగి 79,426 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 578 పాయింట్ల లాభంతో 24,538 వద్ద కొనసాగుతోంది. ఫార్మా మినహా దాదాపు అన్ని రంగాల షేర్లు లాభాల్లోనే ఉన్నాయి. ఆటోమొబైల్ రంగ సూచీ 2.5 శాతం ఎగబాకింది. నిఫ్టీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, మారుతి సుజుకీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు రాణిస్తున్నాయి. రెడ్డీస్ ల్యాబ్స్, సిప్లా, కోల్ ఇండియా, ఎయిర్‌టెల్ స్వల్ప నష్టాల్లో ఉన్నాయి. అమెరికాలో మిడ్‌టర్మ్ ఎన్నికల ఫలితాలతో వాల్‌స్ట్రీట్ దూసుకెళ్లింది. డోజోన్స్ ఏకంగా 1500 పాయింట్లకుపైగా పెరుగగా ఎస్ అండ్ పీ 500 సూచీ 1.58 శాతం, నాస్‌డాక్ 1.44 శాతం ఎగబాకాయి. ఈ పరిణామాలు మన మార్కెట్లకు కలిసొచ్చాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గొచ్చనే అంచనాలతో చమురు ధరలు భారీగా దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 93.5 డాలర్ల వద్ద రెండు నెలల కనిష్ఠాన్ని తాకింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ బలపడింది. నేటి ట్రేడింగ్‌లో 14 పైసలు పెరిగి 94.32 వద్ద కొనసాగుతోంది. వరుసగా నాలుగో రోజు విదేశీ సంస్థాగత మదుపర్ల నుంచి మన మార్కెట్లకు పెట్టుబడులు కొనసాగాయి. బుధవారం ఒక్కరోజే రూ.7284 కోట్ల విలువైన ఈక్విటీలను వారు కొనుగోలు చేశారు. ఒక్క రోజులో ఈ స్థాయిలో కొనుగోళ్లు జరగడం 2025 అక్టోబర్ తర్వాత ఇదే తొలిసారి.

ఉద్యోగులకు స్వచ్ఛంద నిష్క్రమణ ఆఫర్..
మైక్రోసాఫ్ట్, గూగుల్ బాటలో మెటా!

ఫ్రాన్స్‌లో ఉద్యోగులకు మెటా స్వచ్ఛంద నిష్క్రమణ ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం

సుమారు 100 మంది ఉద్యోగులపై ప్రభావం ఉండే అవకాశం

ఒక్కో ఏడాది సర్వీసుకు 2.15 నెలల జీతం ఆఫర్ చేసినట్లు కథనాలు

పది నెలల పాటు 80 శాతం వేతనంతో సెలవు అని సమాచారం

నైపుణ్య శిక్షణ, వ్యాపార ప్రారంభానికి సహకారం అందచే యోచనలో మెటా

ప్రపంచవ్యాప్తంగా టెక్ కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతున్న వేళ.. మరో కొత్త పరిణామం చోటుచేసుకుంటోంది. ఉద్యోగులను నేరుగా తొలగించకుండా స్వచ్ఛందంగా సంస్థ నుంచి వైదొలిగే అవకాశాన్ని కల్పిస్తున్నాయి దిగ్గజ కంపెనీలు. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, గూగుల్ ఈ విధానాన్ని అనుసరిస్తుండగా.. తాజాగా ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా కూడా ఆ జాబితాలో చేరినట్లు సమాచారం. ఫ్రాన్స్‌లోని తమ ఉద్యోగులకు స్వచ్ఛంద నిష్క్రమణ పథకాన్ని మెటా ప్రతిపాదించినట్లు ఫ్రెంచ్ మీడియా సంస్థ 'లా లెటర్' వెల్లడించింది. ఫ్రాన్స్‌లో మెటాకు ప్రస్తుతం సుమారు 300 మంది ఉద్యోగులు ఉన్నారు. ఈ పథకం అమలైతే దాదాపు 100 మంది వరకు సంస్థను వీడే అవకాశం ఉందని కథనం పేర్కొంది. అయితే ఏ విభాగాల్లోని ఉద్యోగులపై ప్రభావం పడుతుందన్నది ఇంకా స్పష్టత రాలేదు.



మైక్రోసాఫ్ట్, గూగుల్ పథకాలకు భిన్నంగా మెటా ప్రతిపాదన ఉందని సమాచారం. ఫ్రాన్స్‌లోని కార్మిక చట్టాల ప్రకారం 'కలెక్టివ్ కాంట్రాక్చువల్ టెర్మినేషన్' (ఆర్‌సీసీ) విధానంలో ఈ ప్రక్రియ చేపట్టనుంది. ఇందులో భాగంగా కంపెనీ, కార్మిక సంఘాల మధ్య చర్చలు జరిపి పరస్పర అంగీకారంతో ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకుంటారు. ఈ పథకంలో చేరాలనుకునే ఉద్యోగులు నవంబర్ 5లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని నివేదిక తెలిపింది.

ఈ పథకం కింద ఉద్యోగులకు ఆకర్షణీయమైన పరిహారం అందించే ప్రతిపాదనను మెటా ముందుకు తెచ్చినట్లు సమాచారం. ఉద్యోగి సంస్థలో పనిచేసిన ప్రతి ఏడాదికి 2.15 నెలల వేతనానికి సమానమైన మొత్తాన్ని చెల్లించనుంది. దీంతోపాటు పది నెలల పాటు మొబిలిటీ లీవ్ కల్పించి.. ఆ సమయంలో స్థూల వేతనంలో 80 శాతం చెల్లించేలా ప్రతిపాదించినట్లు కథనం పేర్కొంది. ఉద్యోగులకు వృత్తిపరమైన నైపుణ్యాల శిక్షణ, సొంతంగా వ్యాపారం ప్రారంభించేందుకు కూడా సహకారం అందించే అంశాన్ని మెటా పరిశీలిస్తున్నట్లు తెలిపింది.

ఈ ప్రతిపాదనపై జులై నుంచి చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఫ్రాన్స్‌లో మెటా గతంలోనూ ఇదే తరహా విధానాన్ని అనుసరించింది. 2023లో కుదిరిన ఒప్పందం ప్రకారం అప్పట్లో సుమారు 350 మంది ఉద్యోగులున్న సంస్థలో 88 మంది వైదొలిగే అవకాశం ఏర్పడింది.

ప్రపంచవ్యాప్తంగా మెటాలో సుమారు 66 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఫ్రాన్స్‌లో ప్రతిపాదించిన పథకాన్ని ఇతర దేశాల్లోనూ అమలు చేస్తుందా? అన్నది ఇంకా తెలియరాలేదు. మరోవైపు గూగుల్ ఐదు దేశాల్లో ఉద్యోగులకు స్వచ్ఛంద నిష్క్రమణ అవకాశాలు కల్పించగా.. మైక్రోసాఫ్ట్ అమెరికా, కెనడా, భారత్, బ్రిటన్‌లోని 60 వేల మంది అర్హులైన ఉద్యోగుల కోసం బైఅవుట్ పథకాన్ని ప్రకటించింది.

మెటా కూడా ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రపంచవ్యాప్తంగా 8 వేల ఉద్యోగాలను తగ్గించే ప్రణాళికను ప్రకటించింది. ఇది అప్పటి మొత్తం ఉద్యోగుల్లో 10 శాతానికి సమానం. మే నెలలో మరో 7 వేల మంది ఉద్యోగులను ఏఐకి సంబంధించిన విభాగాలకు బదిలీ చేయాలని నిర్ణయించింది. ఏఐ సాయంతో గతంలో పెద్ద బృందాలు చేయాల్సిన పనులను ఇప్పుడు ఒక్క ఉద్యోగే పూర్తి చేయగలుగుతున్నారని సంస్థ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ గతంలో పేర్కొన్నారు. 2026లో డిజిటల్ మౌలిక సదుపాయాలు, డేటా కేంద్రాల కోసం మెటా 135 నుంచి 145 బిలియన్ డాలర్ల వరకు మూలధన వ్యయం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏఐపై భారీగా పెట్టుబడులు పెడుతున్న టెక్ దిగ్గజాలు.. అదే సమయంలో ఉద్యోగుల సంఖ్యను, పని విధానాలను పునర్వ్యవస్థీకరిస్తుండటం గమనార్హం.

ఏఐ ఖర్చులపై యాపిల్ కోత.. ఉద్యోగుల బడ్జెట్‌లో భారీ తగ్గింపు!

టెక్ దిగ్గజం యాపిల్ తన ఉద్యోగులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ వినియోగంపై కేటాయించే రోజువారీ బడ్జెట్‌లో కోతలు విధిస్తోంది. సంస్థ ఖర్చుల నియంత్రణ చర్యలలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏఐ వినియోగాన్ని ఒకవైపు ప్రోత్సహిస్తూనే, మరోవైపు దానివల్ల పెరుగుతున్న వ్యయాలను అదుపు చేసేందుకు యాపిల్ ఈ చర్యలు చేపట్టింది. 'బ్లూమ్‌బెర్గ్' కథనం ప్రకారం, గత నెలలో కొంతమంది ఇంజనీర్ల రోజువారీ ఏఐ వినియోగ పరిమితిని 300 డాలర్ల నుంచి 200 డాలర్లకు తగ్గించారు. కొన్ని ఇంజనీరింగ్ బృందాలకు ఈ పరిమితిని 100 డాలర్లకు తగ్గించే ఆలోచనలో యాజమాన్యం ఉన్నట్లు సమాచారం. ఇంజనీరింగేతర విభాగాలకు ఇప్పటికే 100 డాలర్ల పరిమితి ఉండగా, దానిని కొన్ని బృందాలకు 25 డాలర్లకు తగ్గించే ప్రతిపాదనలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే, తమ ప్రాజెక్టులకు అధిక పరిమితి అవసరమైన వారు ఉన్నతాధికారుల నుంచి ప్రత్యేక అనుమతి పొందవచ్చు. ఉద్యోగులు ఓపెన్‌ఏఐకి చెందిన చాట్‌జీపీటీ, గూగుల్ జెమిని, ఆంత్రోపిక్ క్లాడ్ వంటి ఏఐ మోడళ్లను ఉపయోగించినప్పుడు అయ్యే ఖర్చును 'టోకెన్ల' రూపంలో లెక్కిస్తారు. కోడింగ్, డీబగ్గింగ్ వంటి పనులకు ఎక్కువ టోకెన్లు అవసరం కావడంతో ఇంజనీర్లకు ఇప్పటివరకు అధిక బడ్జెట్ ఉండేది. ఈ నిర్ణయంపై కంపెనీలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. గతంలో ఉన్న 300 డాలర్ల పరిమితిని చాలామంది ఉద్యోగులు పూర్తిగా ఉపయోగించుకోలేదని, కాబట్టి ఈ కోత సహజమేనని కొందరు భావిస్తున్నారు. అయితే, సెప్టెంబర్‌లో సీఈవోగా బాధ్యతలు చేపట్టిన జాన్ టర్నస్, సంస్థను తక్కువ



ఖర్చుతో నడపాలని భావిస్తున్నారని, ఈ చర్యలు అందులో భాగమేనని మరికొందరు విశ్లేషిస్తున్నారు. 2026 ఆర్థిక సంవత్సరంలో యాపిల్ పరిశోధన, అభివృద్ధి ఖర్చులు 32 శాతానికి పెరగడానికి ఏఐ మౌలిక సదుపాయాల వ్యయం కూడా ఒక కారణం. ఏఐ ఖర్చులను నియంత్రించడం కేవలం యాపిల్‌కు మాత్రమే పరిమితం కాలేదు. గతంలో ఉద్యోగులను ఏఐ ప్రయోగాలకు విస్తృతంగా ప్రోత్సహించిన యాక్సెంచర్, మైక్రోసాఫ్ట్, మెటా, టెస్లా వంటి సంస్థలు కూడా ఇప్పుడు టోకెన్ ఖర్చులు పెరగడంతో అంతర్గత వినియోగంపై పరిమితులు విధిస్తున్నాయి. కాగా, ఈ నివేదికపై స్పందించేందుకు యాపిల్ ప్రతినిధి నిరాకరించారు.

ముంబయి ఇండియన్స్‌లో హార్దిక్ ఒంటరిగా ఫీలయ్యాడా?
అంబటి రాయుడు కీలక వ్యాఖ్యలు

హార్దిక్ ముంబయిలో ఒంటరిగా ఫీలయ్యాడన్న రాయుడు

కెప్టెన్సీ వదిలి ఆటపై దృష్టి పెట్టాలని సూచన

ముంబయిలో కొనసాగితే ఆటగాడిగానే ఉండాలన్న అభిప్రాయం

జట్టు మారినా ఒక సీజన్ కెప్టెన్సీ వద్దని వ్యాఖ్య

పంజాబ్, చెన్నై జట్లు అతడికి మంచి ఎంపికలని వెల్లడి

ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా చుట్టూ ఐపీఎల్ 2027కు ముందే చర్చ మొదలైంది. అతడు జట్టును వీడనున్నాడంటూ ట్రేడ్ వార్తలు వస్తున్న నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్, చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ఆటగాడు అంబటి రాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ముంబయి జట్టులో హార్దిక్ తనను ఒంటరిని చేశారన్న భావనకు గురై ఉండొచ్చని అభిప్రాయపడ్డాడు. అతడు మళ్లీ ముంబయి తరఫున ఆడాలనుకుంటే కెప్టెన్సీ బాధ్యతలు వదులుకుని ఆటపై దృష్టి పెట్టాలని సూచించాడు. క్రిక్‌బజ్ చర్చలో పాల్గొన్న రాయుడు.. ముంబయిలో హార్దిక్ పరిస్థితి అంత బాలేదని వ్యాఖ్యానించాడు. జట్టులో తనను ఓ మూలకు నెట్టేసినట్టు ఓ ఆటగాడు భావిస్తే, ప్రతి విషయంలోనూ వెనక్కి చూసుకోవాల్సి వస్తుందని చెప్పాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో అలాంటి పరిస్థితులు ఆట గాడి ప్రవర్తనపై ప్రభావం చూపుతాయని అభిప్రాయపడ్డాడు.



హార్దిక్ విషయంలో జరిగిన ప్రతిదానికీ అతడినే తప్పుబట్టలేమని, ఇతర కారణాలు కూడా ఉండొచ్చని పేర్కొన్నాడు. 2024 సీజన్‌కు ముందు గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబయి ఇండియన్స్‌కు తిరిగొచ్చిన హార్దిక్‌కు ఫ్రాంచైజీ కెప్టెన్సీ అప్పగించింది. అప్పటివరకు జట్టుకు నాయకత్వం వహించిన రోహిత్ శర్మను తప్పించి హార్దిక్‌కు బాధ్యతలు ఇవ్వడంపై అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మైదానంలోనూ జట్టుకు ఆశించిన ఫలితాలు దక్కలేదు. హార్దిక్ నాయకత్వంలో మూడు సీజన్లలో ముంబయి ఒక్కసారి మాత్రమే ప్లేఆఫ్స్‌కు చేరినట్లు రాయుడు ప్రస్తావించాడు. హార్దిక్ ముంబయిలోనే కొనసాగాలనుకుంటే కెప్టెన్‌గా కాకుండా ఆటగాడిగా ఆడాలని రాయుడు సూచించాడు. తన సహజమైన ఆటను ఆస్వాదిస్తూ జట్టుకు మ్యాచ్ విన్నర్‌గా మారడంపై దృష్టి పెట్టాలని చెప్పాడు. ఒకవేళ ముంబయిని వీడితే కనీసం ఒక సీజన్ పాటు మరో జట్టులోనూ కెప్టెన్సీ చేపట్టకూడదని అభిప్రాయపడ్డాడు. ట్రేడ్ ద్వారా హార్దిక్ వెళ్లే అవకాశాలపైనా రాయుడు స్పందించాడు. పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లలో అతడికి మంచి వాతావరణం ఉండొచ్చని పేర్కొన్నాడు. అక్కడ కెప్టెన్సీ ఒత్తిడి లేకుండా తన ఆటపై దృష్టి పెట్టవచ్చని చెప్పాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్ మాత్రం ప్రస్తుతం కెప్టెన్ అవసరంతో పాటు పలు సమస్యలు ఎదుర్కొంటున్నందున హార్దిక్‌కు అంత సులభమైన ఎంపిక కాదని విశ్లేషించాడు. హార్దిక్ పాండ్యా ముంబయి నుంచి పంజాబ్ కింగ్స్‌కు మారే అవకాశాలపై వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అర్ష్‌దీప్ సింగ్‌తో ఆటగాళ్ల మార్పిడి ప్రతిపాదనపై చర్చలు జరుగుతున్నట్లు కొన్ని కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ ట్రేడ్‌పై ఆయా ఫ్రాంచైజీల నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

సెంచరీలు కాదు.. 43 పరుగుల ఇన్నింగ్సే బెస్ట్.. కోహ్లీ ఎంపిక వెనుక ఆసక్తికర కారణం

వన్డే క్రికెట్‌లో విరాట్ కోహ్లీ సాధించిన సెంచరీలు ఎన్నో. 183, 133 నాటౌట్ వంటి అద్భుత ఇన్నింగ్స్‌లు అభిమానుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. అయితే తన కెరీర్‌లో అత్యుత్తమ వన్డే ఇన్నింగ్స్ ఏదంటే మాత్రం కోహ్లీ అనూహ్యమైన సమాధానం చెప్పాడు. 2013 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఇంగ్లండ్‌పై చేసిన 43 పరుగుల ఇన్నింగ్సే తనకు అత్యంత ప్రత్యేకమని వెల్లడించాడు. ఈరోజు 38వ పుట్టినరోజు జరుపుకొంటున్న కోహ్లీ.. ఈ సందర్భంగా స్టార్ స్పోర్ట్స్ రూపొందించిన ప్రత్యేక వీడియోలో పాల్గొన్నాడు. తన కెరీర్‌లోని కొన్ని కీలక ఇన్నింగ్స్‌లను జతచేసి, వాటిలో ఏది అత్యుత్తమమో ఎంచుకోవాలని నిర్వాహకులు కోరారు. తొలుత 2011 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో శ్రీలంకపై చేసిన 35 పరుగుల ఇన్నింగ్స్‌ను ఎంపిక చేశాడు. హోబర్ట్‌లో శ్రీలంకపై 2012లో చేసిన అజేయ 133 పరుగులు, 2023 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై చేసిన 85 పరుగుల కంటే దానికే ప్రాధాన్యమిచ్చాడు. ఇంగ్లండ్‌పై 2017లో చేసిన 122, దక్షిణాఫ్రికాపై 2018లో సాధించిన అజేయ 160 పరుగుల ఇన్నింగ్స్‌లనూ పక్కనపెట్టాడు. అయితే చివరకు 2013 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఇంగ్లండ్‌పై చేసిన 43 పరుగుల ఇన్నింగ్స్ ముందు వాటన్నింటినీ వెనక్కి నెట్టాడు. వర్షం కారణంగా 20 ఓవర్లకు కుదించిన ఆ మ్యాచ్‌లో భారత్ 66 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ సమయంలో కోహ్లీ 34 బంతుల్లో 43 పరుగులు చేశాడు. రవీంద్ర జడేజాతో కలిసి ఆరో వికెట్‌కు 47 పరుగులు జోడించాడు. జడేజా 33 పరుగులతో రాణించడంతో భారత్ 129 పరుగులు చేసింది. అనంతరం ఇంగ్లండ్‌ను 124 పరుగులకే పరిమితం చేసి ఐదు పరుగుల తేడాతో విజయం సాధించింది. పాకిస్థాన్‌పై 2012 ఆసియా కప్‌లో చేసిన 183, దక్షిణాఫ్రికాపై 2015లో సాధించిన 138, 2015 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై చేసిన 107 పరుగుల



ఇన్నింగ్స్‌లను కూడా కాదని కోహ్లీ ఎంచుకున్న ఇన్నింగ్స్ ఇది. భారీ వ్యక్తిగత స్కోర్ల కంటే జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు చేసిన కీలక పరుగులకే కోహ్లీ ఎక్కువ విలువ ఇస్తున్నాడని దీని ద్వారా స్పష్టమవుతోంది.

స్పోర్ట్స్

సీఎస్‌కే, ఎస్‌ఆర్‌హెచ్ మధ్య మెగా డీల్..
సగం ధరకే లివింగ్‌స్టోన్ చెన్నై గూటికి!

ఐపీఎల్ 2027 ట్రేడింగ్ విండోలో భారీ డీల్

చెన్నై జట్టులోకి ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, జాక్ ఎడ్వర్డ్స్

సన్‌రైజర్స్ హైదరాబాద్‌లోకి ఖలీల్ అహ్మద్, నాథన్ ఎల్లిస్

రూ.13 కోట్ల లివింగ్‌స్టోన్‌ను సగం ధరకే సొంతం చేసుకున్న సీఎస్‌కే

పేస్ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకున్న హైదరాబాద్ ఫ్రాంచైజీ



ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ట్రేడింగ్ విండోలో ఒక భారీ ఒప్పందం కుదిరింది. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) ఫ్రాంచైజీల మధ్య పలువురు కీలక ఆటగాళ్లు చేతులు మారారు. ఈ మెగా ట్రేడ్‌లో భాగంగా, ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ చెన్నై జట్టులోకి రాగా, భారత లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఖలీల్ అహ్మద్, ఆసీస్ పేసర్ నాథన్ ఎల్లిస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ గూటికి చేరారు. ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన అంశం లివింగ్‌స్టోన్ బదిలీ. గతంలో ఎస్‌ఆర్‌హెచ్ అతడిని రూ.13 కోట్లకు కొనుగోలు చేయగా, ఇప్పుడు చెన్నై సగాని కన్నా తక్కువ ధరకు, అంటే కేవలం రూ.6 కోట్లకు సొంతం చేసుకుంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో లివింగ్‌స్టోన్ కేవలం రెండు మ్యాచ్‌లే ఆడి 15 పరుగులే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. ఇక, గాయం కారణంగా గత సీజన్‌కు దూరమైన జాక్ ఎడ్వర్డ్స్‌ను సీఎస్‌కే అతని ప్రస్తుత ఫీజు రూ.3 కోట్లతో జట్టులోకి తీసుకుంది. ఈ ఇద్దరు ఓవర్సీస్ ఆల్‌రౌండర్ల చేరికతో చెన్నై జట్టు సమతూకం పెంచుకుంది. మరోవైపు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ పేస్ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకుంది. గతంలో 2018 నుంచి 2021 వరకు ఎస్‌ఆర్‌హెచ్‌కే ప్రాతినిధ్యం వహించిన ఖలీల్ అహ్మద్, తన ప్రస్తుత ఫీజు రూ.4.8 కోట్లతో తిరిగి సొంత జట్టులోకి వచ్చాడు. ఐపీఎల్ 2025లో సీఎస్‌కే తరఫున 14 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసిన ఖలీల్, 2026లో గాయం కారణంగా ఐదు మ్యాచ్‌లకే పరిమితమయ్యాడు. డెత్ ఓవర్ల స్పెషలిస్ట్‌గా పేరున్న నాథన్ ఎల్లిస్ రూ.2 కోట్ల ఫీజుతో హైదరాబాద్ జట్టులోకి చేరాడు. అతను కూడా గత సీజన్‌లో గాయం కారణంగా ఆడలేదు. ప్రస్తుత ట్రేడింగ్ విండోలో ఇది మూడో పెద్ద డీల్. ఇప్పటికే లక్నో నుంచి రిషభ్ పంత్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ తిరిగి తీసుకోగా, కుల్దీప్ యాదవ్‌ను వదులుకుంది. అలాగే, ఢిల్లీ నుంచి టి. నటరాజన్ తిరిగి ఎస్‌ఆర్‌హెచ్‌లోకి రాగా, బదులుగా జీషాన్ అన్సారీ ఢిల్లీకి మారిన సంగతి తెలిసిందే.



దక్షిణాది సినిమాలపై బాలీవుడ్ నటుల విమర్శలు సరికాదు: రెజీనా కసాండ్రా!

భారతీయ సినీ పరిశ్రమలో 'నార్త్ వర్సెస్ సౌత్' చర్చ ఎప్పుడూ నడుస్తూనే ఉంటుంది. అయితే తాజాగా ప్రముఖ నటి రెజీనా కసాండ్రా ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఈ ప్రాంతీయ చర్చకు మళ్లీ తెరలేపాయి. సౌత్ సినిమాపై ఉత్తరాది నటీనటులు చేసే విమర్శలను ఆమె తీవ్రంగా తప్పుబట్టడంతో పాటు, హిందీ చిత్రసీమలో తనకు ఎదురైన చేదు అనుభవాలు, ప్రాంతీయ వివక్షను బయటపెట్టారు. జాన్వీ కపూర్, రాధికా ఆప్టే వంటి బాలీవుడ్ నటులు ఇటీవల సౌత్ సినిమా ఇండస్ట్రీపై చేసిన వ్యాఖ్యలపై రెజీనా స్పందిస్తూ.. ఉత్తరాది నటులు దక్షిణాది సినిమాల గురించి ఇలా బహిరంగంగా విమర్శలు చేయడం వల్ల ఇండస్ట్రీల మధ్య అనవసరమైన విభేదాలు వస్తాయని అన్నారు. సౌత్ సినిమాలలో నిజంగానే సమస్యలు ఉన్నాయని భావిస్తే, ఆ ప్రాజెక్ట్‌లలో నటించకుండా వారు ముందే ఎందుకు బయటకు వచ్చి ఉండకూడదని సూటిగా ప్రశ్నించారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, బాలీవుడ్‌లో తనకు ఎదురైన వివక్షను కూడా ఆమె పంచుకున్నారు. ప్రముఖ బాలీవుడ్ దర్శక-నిర్మాత కరణ్ జోహార్‌కు చెందిన 'ధర్మ ప్రొడక్షన్స్' బ్యానర్‌లో తెరకెక్కిన భారీ చిత్రం 'కేసరి చాప్టర్ 2'లో తాను అక్షయ్ కుమార్ భార్యగా ఎంతో ప్రాముఖ్యత ఉన్న పాత్రలో నటించినట్లు రెజీనా తెలిపారు. అయితే సినిమా ప్రమోషన్ల సమయానికి తన పట్ల జరిగిన తీరు తీవ్రంగా బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాలో కీలక పాత్ర పోషించినప్పటికీ, ప్రమోషన్లలో ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తన పేరును తొలగించారని, తనపై వచ్చిన పాటను విడుదల చేసినా సోషల్ మీడియాలో కనీసం ట్యాగ్ చేయలేదని వాపోయారు. తాను సౌత్ ఇండియన్ నటి అనే కారణంతోనే తనపై ఈ వివక్ష చూపించారా అంటూ ఆమె బాలీవుడ్ తీరును నిలదీశారు.



'చంద్రయాన్' నుంచి 'చీఫ్ సైంటిస్ట్' శివ కుమార్ దీకొండ పాత్ర పరిచయం!

ప్రముఖ దర్శకుడు వేణు ఊడుగుల సమర్పణలో, 'సింబ స్క్రీన్ స్టోరీస్' పతాకంపై ప్రవీణ్ మొలక నిర్మిస్తోన్న వైవిధ్యమైన చిత్రం 'చంద్రయాన్' (జష్ఞుఅఎతీఖఎఱుఅ). గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ హిలేరియస్ అడ్వెంచర్ కామెడీ సినిమా నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఈ చిత్రం విడుదలకు ఇంకా 8 రోజులే ఉండడంతో పాత్రలను పరిచయం చేస్తుంది చిత్రయూనిట్. ఇందులో భాగంగా హీరోగా నటిస్తున్న శివ కుమార్ దీకొండ (ఘష్ట్రఅఱు ఖబఎతీ ణష్ట్రవవనశీఅఱు) పాత్రను చిత్ర యూనిట్ అత్యంత ఆసక్తికరంగా పరిచయం చేసింది. ఈ మిషన్ వెనుక ఉండే అసలు మాస్టర్ మైండ్ మరియు 'చీఫ్ సైంటిస్ట్' (జష్ట్రఅవట ఘనిఅవత్అర్) అంటూ శివకుమార్ దీకొండ లుక్‌తో కూడిన కొత్త ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. సమాజంలో తమని తక్కువ చేసి మాట్లాడిన వారి ముందు తమ ప్రతిభను నిరూపించుకోవాలని నలుగురు గ్రామీణ యువకులు గట్టిగా నిర్ణయించుకుంటారు. ఎవరికీ అంతుచిక్కని ఆలోచనగా సొంతంగా ఒక రాకెట్ తయారు చేసి, ఏకంగా చంద్రమండలానికి వెళ్లాలని వారు సాహసించడమే ఈ చిత్ర ప్రధానాంశం. ఈ క్రమంలో మందమర్రి నుంచి చందమామ వరకు సాగే ఈ ప్రయాణం ఆద్యంతం నవ్వులు పూయించనుంది. శివ కుమార్ దీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, 'బలగం' సత్యనారాయణ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు

నయనతార 'మహాశక్తి'కి తెలుగులో గట్టి పరీక్ష.. పోటీగా 'రామాయణ', 'సీన్'!



దక్షిణాది లేడీ సూపర్‌స్టార్ నయనతార ఈ ఏడాది మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే ఈ ఏడాది పలు చిత్రాలతో సందడి చేసిన ఆమె.. ఇప్పుడు 'మూకుత్తి అమ్మన్ 2'తో థియేటర్లలోకి వస్తున్నారు. తెలుగులో ఈ సినిమా 'మహాశక్తి' పేరుతో విడుదల కానుంది. సుందర్ సి దర్శకత్వం వహించిన ఈ భక్తిరస ప్రధానమైన చిత్రంపై తమిళ ప్రేక్షకుల్లో కొంత ఆసక్తి కనిపిస్తున్నప్పటికీ, తెలుగు రాష్ట్రాల్లో మాత్రం విడుదలకు ముందు ఆశించిన స్థాయిలో సందడి కనిపించడం లేదు. నవంబర్ 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'మూకుత్తి అమ్మన్' చిత్రానికి కొనసాగింపుగా రూపొందిన ఈ సినిమాలో నయనతార మరోసారి అమ్మవారి పాత్రలో కనిపించనున్నారు. అయితే ఈసారి కథను మరింత భారీ స్థాయిలో, పౌరాణిక అంశాలు, దైవశక్తి నేపథ్యంలో తెరకెక్కించినట్లు ప్రచార చిత్రాలు సూచిస్తున్నాయి. గతంలో వచ్చిన మొదటి భాగం భక్తితో పాటు వినోదం, సామాజిక అంశాలను కలగలిపి ప్రేక్షకులను ఆకట్టుకుంది. రెండో భాగానికి సుందర్ సి దర్శకత్వం వహించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ సినిమాలో రెజీనా కసాండ్రా ప్రతినాయిక పాత్రలో నటిస్తున్నారు. కన్నడ నటుడు దునియా విజయ్, అజయ్ ఘోష్, ఊర్వశి, అభినయ, యోగి బాబు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, రౌడీ పిక్చర్స్ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మించాయి. భారీ తారాగణం, భక్తి నేపథ్యం, గ్రాఫిక్స్‌తో కూడిన దృశ్యాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని చిత్ర బృందం భావిస్తోంది. తమిళంలో నయనతారకు ఉన్న క్రేజ్‌తో 'మూకుత్తి అమ్మన్ 2'పై అంచనాలు ఉన్నాయి. కానీ తెలుగులో మాత్రం 'మహాశక్తి'కి విడుదలకు ముందు పెద్దగా ప్రచార హడావుడి కనిపించడం లేదు. దీంతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఆరంభాన్ని అందుకుంటుందనే ఆసక్తి నెలకొంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్ర పంపిణీ బాధ్యతలను మైత్రి మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ చేపట్టింది. విడుదలకు ముందు ప్రచారం కంటే ప్రేక్షకుల నుంచి వచ్చే స్పందనే సినిమాకు కీలకం కానుంది. నవంబర్ 6న 'మహాశక్తి'కి బాక్సాఫీస్ వద్ద పోటీ కూడా గట్టిగానే ఉండనుంది. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'రామాయణ' థియేటర్లలో సందడి చేస్తుండగా, అదే రోజున సూర్య నటించిన 'సీన్' కూడా విడుదల కానుంది. ఈ రెండు సినిమాల మధ్య 'మహాశక్తి'కి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం సవాలుగా మారింది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకుల్లో ముందుగానే ఆసక్తి పెంచుకోలేకపోవడం సినిమాకు కొంత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది.

రణ్‌బీర్-సాయిపల్లవిల 'రామాయణ - 1' మెప్పించిందా?



రామాయణం రివ్యూ

సినిమా పేరు: రామాయణం
తారాగణం: రణబీర్‌కపూర్, సాయిపల్లవి, యశ్, కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్‌సింగ్, రవి దూబే, వివేక్ ఒబెరాయ్, అరుణ్‌గోవిల్.
దర్శకత్వం: నితీశ్ తివారీ
నిర్మాత: నమిత్ మల్హోత్రా
సంగీతం: హన్స్ జిమ్మర్, ఏ.ఆర్.రెహమాన్

భారతీయ సినిమా చరిత్రలో అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఫ్రాంచైజీగా చరిత్ర సృష్టించింది నితీశ్ తివారీ 'రామాయణ'. ప్రకటన వచ్చిన నాటి నుంచే ఈసినిమాపై అంచనాలు మొదలయ్యాయి. రాముడిగా రణబీర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్, మండోదరిగా కాజల్, కైకసిగా శోభన, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్.. ఇలా తారాగణ వివరాలు తెలియగానే ఆ అంచనాలు ఆకాశాన్నంటాయి. ప్రచార చిత్రాలు సైతం ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేశాయి. ఫస్ట్ పార్ట్ ఈ దీపావళికి, నెక్స్ట్ పార్ట్ వచ్చే ఏడాది దీపావళికి అని ప్రకటించగానే, తొలిపార్ట్ కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీప్రియులంతా ఆతృతగా ఎదురు చూశారు. అనుకున్నట్టే 'రామయాణ -- 1' సినిమా గురువారం థియేటర్లలోకి ఎంట్రీ ఇచ్చింది. మరి అందరి అంచనాలనూ ఈ సినిమా అందుకున్నదా? ఈ సినిమాకు ముందు బాలీవుడ్‌లోనే తెరకెక్కిన 'రామాయణ' ఇతిహాసం 'ఆది పురుష్' ఆడియన్స్‌కి, నిర్మాతలకు చేదు అనుభవాలను మిగిల్చింది. మరి నితీశ్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ 'రామాయణం' ప్రేక్షకుల ఎలాంటి అనుభూతినిచ్చింది? అనేది తెలుసుకునే ముందు కథలోకి వెళ్లాలి.

కథ

ఇది యుగయుగాలుగా భారతీయుల రక్తంలో జీర్ణించుకుపోయిన కథ. కాబట్టి రామాయణ కథ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇది జగమెరిగిన కావ్యం. అయితే.. ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందించారు కనుక, ఈ తొలి భాగం దశాననుడు రావణుడిగా మారిన పరిణామక్రమాన్ని, శ్రీరాముడి జన్మవృత్తాంత, తాటక వధ, శివధనుర్భగం, సీతారామలక్ష్మణ వనవాసం, కబంధుని వధ, కరదూషణాధుల వధ, సీతాపహరణం, జటాయు మరణం ఘట్టాలతో సాగింది. జాటాయు మరణానంతరం 'రావణుడ్ని సంహరించబోతున్నాను' అంటూ రాముడు ప్రతిజ్ఞ చేయడంతో ఈ తొలి భాగం ముగిసింది. ఇక సుందరకాండ, రావణ వధ, శ్రీరామపట్టాభిషేకం తదితర అంశాలన్నీ రెండో పార్ట్‌లో ఉంటాయన్నమాట.

విశ్లేషణ

దేవదానవ సంగ్రామంలో ఓడిపోయి, రాజ్యాన్ని పోగొట్టుకొని పాతాళలోకంలో తలదాచుకున్న రాక్షస జాతికి పునరుజ్జీవాన్ని అందించేందుకు దానవరాణి కైకసి, తన తనయుడు దశాననుడిలోని పౌరషాగ్నిని రగిల్చడం, ఘోర తపస్సు చేసి, బ్రహ్మ దేవుడి వరాన్ని పొందిన దశాననుడు దానవసామ్రాట్టు రావణబ్రహ్మగా లంకా రాజ్య సింహాసన్నా అధిష్టించడంతో కథ మొదలైంది. ప్రతినాయకుడి శక్తిసామర్థ్యాలను అద్భుతంగా ఆవిష్కరించి, కథానాయ కుడు సాధించబోయే కార్యం ఎంత కష్టతరమైనదో ప్రేక్షకు లకు వివరించడంలో ముందు దర్శకుడు నితీశ్ తివారీ సక్సెస్ అయ్యారు. నిజానికి రావణుడి పాత్రకు ఆయనిచ్చిన ఎలివేషన్స్ రాముడికి కూడా ఇవ్వలేదు. నిజానికి రాముడికి ఎలివేషన్ అవసరం లేదు కూడా. రావణుడనేవాడు ఎంతటి మహావీరుడైనా, శక్తివంతుడైనా చివరకు వాడు పోయేది రాముడి చేతిలోనే అని ఆడియన్స్‌కి తెలుసు కాబట్టి, ఎలివేషన్స్ అవసరం లేదనుకుని ఉండొచ్చు. సాదాసీదాగా రాముడి పాత్రను కథలోకి ప్రవేశింపజేసి, నిదానంగా ఆడియన్స్‌కి 'శ్రీరాముడు' అనే వ్యాక్సిన్‌ని ఆడియన్స్‌కి ఇంజెక్ట్ చేశాడు దర్శకుడు నితీశ్. సినిమా చూడంగ చూడంగ.. రణబీర్‌లో రాముడ్ని చూడటం మొదలుపెట్టారు ఆడియన్స్. రణబీర్ కూడా అభినయం విషయంలో అద్భుతం అనిపించాడు. అయితే.. అతని ఆహార్యం బావున్నా:. నీలమేఘశ్యాముడిగా రాముడ్ని చూపించకపోవడం తెలుగువారికి మింగుడు పడదు. అందుకే.. రణబీర్‌ని రాముడిగా ఒప్పుకోవడానికి కాస్తంత టైమ్ పడుతుంది. నిజానికి 'రామాయణం'లోని బాలకాండ, అరణ్యకాండ కాస్త స్లోగా అనిపిస్తాయి. కానీ దర్శకుడు నితీశ్ తివారీ ఎక్కడా జనానికి విసుగు అనిపించకుండా, తొలి పావుగంట రావణాసుడి ఎపిసోడ్ తో, తర్వాత తాటక వధ, కంబధ వధ, కరదూషణాదుల వధ, జటాయు మరణం.. లాంటి అద్భుతమైన యుద్ధ సన్ని వేశాలను హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కించి, ఎక్కడా ల్యాగ్ అనిపించకుండా ఆసక్తికరంగా, అందరికీ నచ్చేలా తీసి, సక్సెస్ అయ్యారు. అయితే.. ఇప్పటివరకూ రావణమాత కైకసి పాత్రను పాజిటీవ్‌గానే మనం చూశాం.కానీ ఈ సినిమాలో కైకసి నుంచి రావణుడ్ని విష్ణద్వేషం మొదలైనట్టు చూపించారు. అలాగే.. శ్రీరాముడి ముందు భార్గవరాముడు మోకరిల్లడం లాంటి సీన్స్ కూడా జనానికి మింగుడు పడవు. అయితే.. మిగతా సన్నివేశాలన్నీ జనరంజకంగా తెరకెక్కించారు. మొత్తంగా తొలిభాగంతోనే దర్శకుడు నితీశ్ జనాల్లో మంచి మార్కులు సంపాదించుకున్నారు.

నటీనటులు

రాముడిగా రణబీర్ చక్కగా అభినయించాడు. పరశు రాముడిగా కూడా ఓ సన్నివేశంలో కనిపించి అదరహో అనిపించుకున్నారు. ఇక సీతగా సాయిపల్లవి ఒదిగిపోయి నటించింది. ఆమె ఆహార్యం, అభినయం నిజంగా అద్భుతం. ఇందులో సీతను కూడా ఓ యోధురాలిగా చూపించి, ఓ కొత్త ప్రయోగానికి తెరలేపారు దర్శకుడు నితీశ్. రామాయణాన్ని నిశితంగా గమనించిన వారికి, అలా చూపించడం తప్పు కాదు అనిపిస్తుంది. ఎందుకంటే.. మహావీరులు, మహాబలులు సైతం ఎత్తలేని శివధనుస్సును అలవోకగా ఎత్తిన మహాబలశాలి సీతామ్మ. అలాంటి సీతమ్మ యోధురాలు ఎందుకు కాకూడదు?. మొత్తంగా సాయిపల్లవి సీతగా చాలా బాగా నటించింది. సీతాసాధ్విగా, వీరనారిగా పలు కోణాలను ఆమె పలికించిన తీరు బావుంది. లక్ష్మణుడిగా రవి దూబే కూడా బావున్నాడు. ఇక రావణుడిగా యశ్ అయితే.. విశ్వరూపం చూపించాడు. శూర్పణఖ పాత్రకు రకుల్ ప్రీత్‌సింగ్ నటన ఓ గౌరవాన్ని తెచ్చింది. మిగతా నటీనటులంతా పరిధిమేర తమ పాత్రలకు న్యాయం చేశారు.

సాంకేతికంగా

సాంకేతికంగా అన్ని విభాగాలూ బాగా పనిచేశారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజన్స్(ఏఐ) ఉపయోగించి డబ్బింగ్ విషయంలో, అచ్చంగా తెలుగు సినిమాను చూస్తున్న అనుభూతినే తీసుకురాగలిగారు. లిప్ సింక్ కూడా సరిగ్గా సరిపోయింది. కెమెరా పనితనం బావుంది. ఏఆర్ రెహమాన్ పాటలు, నేపథ్య సంగీతం భావగర్భితంగా, కథ స్థాయికి తగ్గట్టుగా సాగింది. యాక్షన్ అంశాలను కూడా అద్భుతంగా తెరకెక్కించారు. సీజీ వర్క్ అయితే.. నేచురల్‌గా అనిపించింది. మొత్తంగా నిర్మాత పెట్టిన ప్రతి పైసా తెరపై కనిపించింది. రావణాడ్ని సంహరిస్తానని రాముడు చెప్పడంతో ప్రథమార్థం ముగిసింది. సెకండ్‌పార్ట్‌లో ఆంజనేయుడు రాబోతున్నాడని హింట్ ఇస్తూ.. ఆంజనేయుడి బిట్స్‌ని చూపించి, సముద్రాన్ని లంఖిస్తున్న మారుతిగా సన్నీడియోల్‌ని వెనకనుంచి చూపించడం అడియన్స్‌కి గూస్‌బంప్స్ తెప్పించాయి. హనుమాన్‌చాలీసా వస్తుండగా టైటిల్స్ దిగుతుంటే.. ఆంజనేయుడి ఆగమానం గుర్తొచ్చి జనం భావోద్వేగానికి లోనయ్యారు.

చివరిగా ఇంటిల్లిపాదీ కలిసి చూడాల్సిన సినిమా 'రామాయణం'.

బలాలు

కథనం, నటీనటుల నటన, సాంకేతికత..

బలహీనతలు

పాత్రలకు విరుద్ధంగా అనిపించిన కొన్ని సన్నివేశాలు

రేటింగ్ 3/5

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999